పెన్ పవర్
తెలంగాణ రౌండప్




సూరారం కాలనీలో కొంపల్లి సర్కిల్ సిఎంసి చర్యలు తీసుకున్న అక్రమ నిర్మాణం..ఇదే..

# సిఎంసి సర్కిళ్ళలో..! చర్యల గారడీ..?

- అక్రమ కట్టడాల కూల్చివేతల మాటున భారీ కరప్షన్ దందా..?
- కొంపల్లి సర్కిల్-56 సిఎంసి నిర్లక్ష్యం..! బాధితుడి ఫిర్యాదులు బేఖాతర్..!
- విసుగెత్తిన సదరు బాధితుడు ఆత్మహత్యే శరణ్యం అంటూ వాయిస్ మెస్సేజ్..

- సిఎంసి వ్యాప్తంగా ఒకటే తీరు కూల్చివేతలు శ్లాబ్‌లకు రంధ్రాలు చేస్తే..?
- అదనపు అంతస్తులు కూల్చినట్లేనా..? జీరో సెట్‌బ్యాకులు-రోడ్డు ఆక్రమణ సక్రమమేనా..?
- సిఎంసి కమిషనర్ మౌనం..! ప్రజలను రిస్కులో పెడుతున్న వైనం..?



తన ఇంటికి గ్యాప్ లేకుండా (జీరో సెట్‌బ్యాకులు) స్పష్టంగా..

- కొంపల్లి సర్కిల్ అధికారుల నిర్వాకంపై.. సూరారంలో ఓ బాధితుడి ఆవేదన..
- అధికారపార్టీ ముసుగులో ఓ నిర్మాణ దారుడు బరితెగించి నిబంధనలు ఉల్లంఘన..
- రోడ్డు ఆక్రమణ-అదనపు అంతస్తులు- జీరో సెట్‌బ్యాకులు..! చర్యలు, శ్లాబ్‌కు రంధ్రాలు..!
- ఈ అక్రమ నిర్మాణంలో శ్లాబ్‌కు రంధ్రాలు చేసి చేతులు దులుపుకున్న టౌన్‌ప్లానింగ్..
- నవ్వుల పాలవుతున్న కూల్చివేతలు..! అభాసుపాలు అవుతున్న పట్టణ ప్రణాళిక..
- పాలకులు సరిగ్గా లేకపోతే..! పరిపాలనా వ్యవస్థ ఎలా ఉంటుందో.. ఇదే నిదర్శనం..

- దుండిగల్-నిజాంపేట్-కొంపల్లి సిఎంసి సర్కిళ్ళలో తాండవిస్తున్న అక్రమ దందా..?
- మొన్న కీసర పోలీసులు ఏసీబీకి దొరికారు.? వీళ్ళు దొరకలేదు అంతే వ్యత్యాసం..?
- రోజురోజుకూ మితిమీరి పోతున్న సిఎంసి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ చేతివాటం..?
- సిఎంసి ఉన్నతాధికారులకు తెలిసే ఈ వ్యవహారం కొనసాగుతుందా, అన్న ప్రశ్నలు..?

వివరాలు 4లో..

## గాజులరామారంలో..! రెవెన్యూ 'పంజా'..!

### ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై భారీ కూల్చివేతలు..!




- కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్వే నెం. 329/1, 342లో భారీ కూల్చివేతలు..
- 25 ఇళ్లు, 10 బేస్‌మెంట్లు నేలమట్టం చేసినట్లు తహశీల్దార్ రాజేష్ స్పష్టం..
- కబ్జాదారుల గుండెల్లో గుబులు..! ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ దూకుడు..

-5 లో



## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం

- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ

-4లో

## మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి

### రేవంత్ కు కేటీఆర్ సవాల్

- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

-6లో



# సిఎంసి సర్కిళ్ళలో..! చర్యల గారడీ..?

- కొంపల్లి సర్కిల్-56 సిఎంసి పరిధి సూరారం కాలనీలో లంచావతారుల నిజస్వరూపం..?
- ప్రజలను ప్రమాదంలో పెట్టే ప్రమాదకర అక్రమ కట్టడాలకు అధికారుల వత్తాసు..?
- ఒక్క సూరారం కాలనీలోనే మూడుచోట్ల, రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు..
- రెండుచోట్ల అధికారపార్టీ నాయకుల ముసుగులో.. అక్రమ కట్టడాలకు రక్షణ..?

కొంపల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ గారికి
నమస్కరించి,

నేను ప్రభాకర్ శర్మ
సూరారం కాలనీ నివాసిని.

మా ఇంటి పక్కన ఒక పెద్దమనిషి పేరు నందగోపాల్ ఇంటి నెంబర్ 5-56 భజరంగ్ మైదాన్ పక్కన రెండవ ఓం జండా దగ్గర ఇల్లు నిర్మిస్తున్నాడు. అతను రోడ్డు కొద్దిగా అక్రమించి పరిమితికి మించి అంతస్తులు g+5 కట్టాడు. అతని వల్ల మా ఇంటి గోడలు దెబ్బతిరుటున్నాయి.

గతం లో కూడా GHMC వారు వచ్చి స్లాబ్ కొద్దిగా కూలగొట్టి వెళ్ళారు. మీడియా వారు కూడా వచ్చి చూసి వెళ్లారు కానీ ఈ సమస్యకి పరిష్కారం చూపించచ లేదు.

గతం లో డిప్యూటీ కమిషనర్ గారికి టౌన్ ప్లానింగ్ అధికారికి కూలగొట్టి నప్పుడు వచ్చిన సూపర్వైజర్ మధు గారికి వీడియో తీసి పంపాను కానీ వీరిలో ఎవరో కానీ నేను పంపిన వీడియోని మళ్ళీ అక్రమ కట్టుతున్న నందగోపాల్ గారికి పంపారు అని తెలిసింది.

అధికారులు మీడియా వారి తప్పిదం వలన మా ఇల్లు దెబ్బతింది కాపున అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

నాకు న్యాయం జరగకపోతే నేను అందరి పేరు రాసి అత్మహత్య చేసుకోవడానికి కూడా వెనకాడను.

ఇట్లు

రాచపూడి ప్రభాకర్ శర్మ
H no 5-56
సూరారం కాలనీ..

కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు, బాధితుడు రాసిన లేఖ..


పెన్ పవర్
6 | పెన్ పవర్ | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026
'సిఎంసి చర్యలంటే... స్లాబులు కొట్టడమేనా..?'
గచ్చిబౌలి ఘటన తర్వాతైనా మారరా..?



పుట్టింగుల తవ్వకాల సమయంలో.. పక్కింటికి ప్రమాదం తలపెట్టే విధంగా.. (ఫైల్‌ఫొటో)


సంబంధిత అక్రమ నిర్మాణం మరోవైపు నుండి ఈ దృశ్యం.. ప్రస్తుత ఫొటో..

నాడు బీఆర్ఎస్ నేతల మాటున అక్రమ కట్టడాల దందాపై విమర్శలు ఉండగా..? నేడు అధికార కాంగ్రెస్ నేతలు, అక్రమ నిర్మాణాలకు రక్షణ కవచంగా ఉంటున్నారని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ప్రభుత్వాలు మారినా, టిజి-బిపాస్ చట్టం అమలు కాని వైనం.. మరోవైపు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సర్కిళ్ళ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ కరప్షన్‌కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు, ఈ అక్రమ నిర్మాణాల చర్యలతో తేటతెల్లం అవుతుంది..? అక్రమం ఏదైనా..! నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలో ఉన్నా సరే..! చర్యలు మాత్రం శ్లాబ్‌లకు రంధ్రాలు చేయడమేనా..? సిఎంసి చర్యలతో ప్రమాదాలు నియంత్రిస్తున్నారా..? ప్రోత్సహిస్తున్నారా..? టౌన్‌ప్లానింగ్ అధికారులు కనీస అవగాహన తోనే, విధులు నిర్వర్తిస్తున్నారా..? శ్లాబ్‌లకు రంధ్రాలు చేస్తే..! అదనపు అంతస్తులు కూల్చినట్టేనా..? రోడ్డు ఆక్రమణలు, జీరో సెట్‌బ్యాకులు సక్రమం అయినట్లేనా..? అన్న ప్రశ్నలు కీలకంగా తలెత్తుతున్నాయి.. అనుమతుల్లేనివి, నిబంధనలు ఉల్లంఘించినవి, సీజ్‌చేసిన అక్రమ నిర్మాణాలకు.. గల్లీ నాయకులు కూడా అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. చర్యలు తీసుకోకుండా, అక్రమ కట్టడాలకు రక్షణ కవచంగా నిలుస్తున్నారని ప్రశ్నలు లేవనెత్తుతోంది.. అధికారుల నిర్లక్ష్యపు చర్యలపై, ఓ బాధితుడు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తన ఇంటికి ఆనుకని నిర్మించిన అక్రమ బహుళ అంతస్తుల భవనంపై అధికారుల చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.. తనకు ఆత్మహత్యే శరణ్యమనే ఆడియో మెస్సేజ్, పలువురికి ఆవేదన కలిగిస్తుంది.. ఈ విషయంలో కొంపల్లి సర్కిల్-56 అధికారుల పనితీరును ఎండగడుతోంది..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 18:**

**సిఎంసి కమిషనర్ కూల్చివేతల ఆదేశాలు..!కొంపల్లి సర్కిల్ అధికారుల బరితెగింపు చర్యలు..! ఓ బాధితుడిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అక్రమ నిర్మాణ దారులకు అండగా ఉంటూ, స్థానిక ప్రజలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. రోడ్డు ఆక్రమణ, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకులు జీరో, ఈ నిబంధనలు ఉల్లంఘించిన అక్రమార్కులకు అనుకూలంగా చర్యలు చేపడుతున్న కరప్షన్ అధికారులపై సిఎంసి కమిషనర్ దృష్టి సారించాలని, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. ఈ ప్రమాదకర అక్రమ నిర్మాణంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.**

మేము అధికారులం.. మేము చెప్పిందే వేదం.. అన్న రీతిలో అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు.. నగర ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తుంది.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గచ్చిబౌలి అంజయ్యనగర్ ప్రమాద ఘటనతో, అప్రమత్తమైన సిఎంసి కమిషనర్ సృజన ఐఏఎస్ వివిధ సర్కిళ్ళలోని అక్రమ కట్టడాలపై, చర్యలు చేపట్టాలని ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. అధికారుల చర్యల తీరు, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థకే మచ్చతెస్తున్నాయనే విమర్శలు తలెత్తుతున్నాయి.. తమ చర్యలతో అధికారులు గారడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. కొంపల్లి సర్కిల్ సిఎంసి పరిధి, సాయిబాబా నగర్ 292 డివిజన్, సూరారం కాలనీలోని ఓ అక్రమ భవనానికి అధికారుల సహకారం, ప్రజలను ప్రమాదంలో పెట్టే విధంగా ఉంది.. ఓవైపు రోడ్డు ఆక్రమణ.. సెట్‌బ్యాకులు జీరో, ఐదు అంతస్తుల నిర్మాణంలో, అక్రమంగా 3 అదనపు అంతస్తులు.. నిబంధనలు ఉల్లంఘించిన ఈ అక్రమ భవనానికి అధికారులకు ఏమేరకు ముడుపులు ముట్టాయో తెలియదు కానీ..! అధికారుల చర్యలు, ఆగ్రహం తెప్పిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు..

నాలుగో అంతస్తులో శ్లాబ్‌కు రంధ్రాలు చేసి వదిలేశారు.. దీంతో రోడ్డు ఆక్రమణ, సెట్‌బ్యాకుల ఉల్లంఘనల సంగతేంటి..? అన్న ప్రశ్నలే ప్రధానంగా ఉత్పన్నం అవుతున్నాయి.. చర్యల తీరు చూస్తే అక్రమ నిర్మాణాన్ని నిజంగా తొలగించారా..? లేక కేవలం చర్యలు చేపట్టినట్లు ఫొటోషూట్ చేశారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.. చర్యలు చేపట్టిన భవనంలోనే దర్జాగా పనులు చేయడంలో ఆంతర్యం ఏమిటి..? తీసుకున్న ముడుపులకు న్యాయం చేస్తున్నారా..? అసలు సిఎంసి కమిషనర్ చర్యల ఆదేశాలకు అర్థం..? కూల్చేసినట్టు నటించమని సంకేతమా..? ఐదంతస్తులు తగ్గలేదు..! జీరో సెట్‌బ్యాకులు అలాగే ఉన్నాయి.. రోడ్డు ఆక్రమణ అట్లనే ఉన్నది.. ఇందులో కొంపల్లి సర్కిల్ అధికారుల చేతివాటమే కనిపిస్తుంది కానీ..? చర్యలు ఎక్కడ..? అంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు..

## నాకు ఆత్మహత్యే శరణ్యం..! పక్కింటి బాధితుడు కంటతడి..!

సూరారం కాలనీలలోని ఈ అక్రమ నిర్మాణ దారుడు, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడట.. ఇంటి నిర్మాణం కోసం పాతింటిని పడేసి, "స్టిల్ట్ ప్లస్ 2" అంతస్తులకు టౌన్‌ప్లానింగ్ నుండి అనుమతి పొందినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. సదరు నిర్మాణ దారుడు పనుల ప్రారంభం నుండి, పుట్టింగుల తవ్వకాలతో, పక్కింటికి ప్రమాదం తలపెట్టే విధంగానే వ్యవహరించినట్టు వీడియోల ద్వారా, సదరు బాధితుడు వెల్లడించాడు.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదట.. తన ఇంటిని ఆనుకుని, సెట్‌బ్యాకులు ఉల్లంఘించి, ఐదంతస్తులు నిర్మించే వరకు, మామూళ్ళ మత్తులో ఉన్న అధికారులు, చివరికి శ్లాబ్‌కు ఒక రంధ్రం చేసి వెళ్ళిపోయారని బాధితుడు ఆరోపించారు.. అదనపు అంతస్తులు కూల్చలేదు.. తన ఇంటిని అతుక్కుని అట్లనే ఉన్నది.. అక్రమ నిర్మాణ దారుడు.. తన పలుకుబడి ఉపయోగించి, అధికారపార్టీ అనే ముసుగులో అధికారులను మేనేజ్ చేశాడా..? ముడుపులు ముట్టచెప్పాడా..? ఏమో తెలియదు కానీ..! తన ఆవేదనను మీడియాకు తెలియజేశాను, అధికారులకు ఫిర్యాదు చేశాను, అయినప్పటికీ తనకు న్యాయం జరగలేదని, కంటతడి పెట్టాడు.. తన ఫిర్యాదును గౌరవించని కొంపల్లి సర్కిల్ సిఎంసి అధికారులు.. అక్రమ నిర్మాణ దారునికి అండగా ఉంటూ.. ప్రజలను ప్రమాదంలో పడేస్తున్నారని ఆరోపించారు.. తనకు న్యాయం జరగకపోతే..! ఆత్మహత్య చేసుకుంటానని ఓ వాయిస్ మెస్సేజ్ ద్వారా తెలిపాడు..



రోడ్డు ఆక్రమణ స్పష్టంగా..


అధికారుల మొక్కుబడి చర్యలు.. శ్లాబ్ కొట్టేస్తే..? అంతస్తులు తగ్గాయా..?

# సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

**హైదరాబాద్ పెన్ పవర్:**సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు.కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని,
ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

- ఫిర్యాదు అందగానే తహశీల్దార్ ఆదేశం, రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు..
- ప్లాట్ల పేరుతో ప్రభుత్వ భూములు అమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరిక..!
- కూల్చినవి మళ్లీ నిర్మిస్తే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడతామని ఎమ్మార్వో హెచ్చరిక..!
- తహశీల్దార్ ఆదేశాలతో డిప్యూటీ తహశీల్దార్ పర్యవేక్షణలో కూల్చివేతలు..
- ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ దూకుడు.. స్థానికుల హర్షం..




గాజులరామారంలో రెవెన్యూ కూల్చివేతలు..

# గాజులరామారంలో..!

# రెవెన్యూ 'పంజా'..!

- కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్వే నెం. 329/1, 342లో భారీ కూల్చివేతలు..
- 25 ఇళ్లు, 10 బేస్‌మెంట్లు నేలమట్టం చేసినట్లు తహశీల్దార్ రాజేష్ స్పష్టం..
- కబ్జాదారుల గుండెల్లో గుబులు..! ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ దూకుడు..

## ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై భారీ కూల్చివేతలు..!




**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** గాజులరామారంలో కబ్జాదారుల ఆగడాలకు రెవెన్యూ అధికారులు చెక్ పెట్టేదిశగా చర్యలు ప్రారంభించారు.. ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం పరిధిలోని సర్వే నెంబర్లు 329/1, 342లో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించినట్లు గుర్తించిన ఇళ్లు, బేస్‌మెంట్లపై శుక్రవారం భారీగా కూల్చివేతలు చేపట్టారు. సాయిబాబా బస్తీ, సాబేర బస్తీ, అబిద్ బస్తీ, బురుగ రాజన్న బస్తీల్లో సుమారు 25 ఇళ్లతో పాటు మరో 10 బేస్‌మెంట్లను జేసీబీల సహాయంతో తొలగించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీబీలను రంగంలోకి దించి నిర్మాణాలను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు..

## ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల విక్రయాలపై హెచ్చరిక..

ఈ సందర్భంగా తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కొందరు కబ్జాదారులు ఆక్రమించి, అమాయక ప్రజలకు ప్లాట్లుగా విక్రయిస్తున్నారని పేర్కొన్నారు.. కబ్జాదారుల మాయమాటలు నమ్మి ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ఆయన ప్రజలకు సూచించారు.. భూమికి సంబంధించిన హక్కులు, రికార్డులు, ప్రభుత్వ నిషేధిత జాబితా తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లకు వెళ్లాలని, కబ్జాదారుల మాయమాటలు నమ్మొద్దంటూ సూచించారు..



డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ పర్యవేక్షణలో చర్యలు..



## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేనా..?

గాజులరామారం పరిధిలో ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, తరచూ అక్రమ నిర్మాణాల అంశం చర్చనీయాంశంగా మారుతోంది.. తాజాగా రెవెన్యూ అధికారులు చేపట్టిన ఈ కూల్చివేతలతో ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులు దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.. అయితే కూల్చివేతలతో పాటు ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతున్న వారిని గుర్తించడం, కొనుగోలు చేసిన వారికి వాస్తవ పరిస్థితులను వివరించి, పేదలు మోసపోకుండా చర్యలు చేపడుతున్నారు.. అధికారుల తాజా హెచ్చరిక నేపథ్యంలో గాజులరామారం ప్రభుత్వ భూములపై రెవెన్యూ శాఖ పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం కానుందా..? అనేది వేచి చూడాలి.

## మళ్లీ నిర్మిస్తే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు: డిప్యూటీ తహశీల్దార్..

కూల్చివేసిన ప్రాంతాల్లో తిరిగి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.. తొలగించిన నిర్మాణాలను మళ్లీ నిర్మించిన పక్షంలో ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ రాజేష్ స్పష్టం చేసినట్లు డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ తెలిపారు.. ఈ అక్రమ నిర్మాణాలకు సహకరించిన సిబ్బంది ఎవరైనా చర్యలు తప్పవని, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయమని అన్నారు..

---



# గణేష్ మండపాలను సందర్శించిన వారాల వినోద్ కుమార్..

## ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమంలోపల్గొన్న వినోద్..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 18:** వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా 292వ డివిజన్ సాయిబాబా నగర్‌లో ఏర్పాటు చేసిన వివిధ గణేష్ మండపాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమ నేత వారాల వినోద్ కుమార్ సందర్శించారు. మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయా మండపాలకు చేరుకున్న ఆయన గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం మండపాల నిర్వహకులు వారాల వినోద్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు.. అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానికంగా భక్తి వాతావరణం నెలకొంది. గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానిక బస్తీ వాసులు ఈ ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, రాజు యాదవ్, గట్టు అశోక్, వేణు ముదిరాజ్, కిషోర్, రాజేష్ తదితరులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# తిరగబడ్డ గులాబీ వ్యూహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జరిపిన నిరసన, ఆ తదనంతరం జరిగిన ఘర్షణల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. చట్టసభల ప్రాంగణంలో ఆందోళనను తీవ్రంగా పరిగణించి, ప్రతిపక్షంపై రాజకీయ మైలేజ్ సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగింది. బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం, చివరికి మాజీ మంత్రి కేటీఆర్ పిఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో గంటల తరబడి హాజరుపరచడం వరకు వ్యవహారాన్ని తీసుకెళ్లారు. అయితే, ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిందో, అంతకంటే ఎక్కువ రాజకీయ ప్రతికూలతలను ఎదుర్కొనే ప్రమాదంలో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రజాప్రతినిధులపై నమోదు చేసిన తీవ్రమైన కేసులు, అలాగే విచారణ ప్రక్రియ శృతిమించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ నేతలను చట్టబద్ధంగా కట్టడి చేయాలనే ఉద్దేశం వ్యూహాత్మకమే అయినప్పటికీ, కక్షసాధింపు చర్యల స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ సిబ్బందిని విచారిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి గొడవ పడటానికి యత్నించారనే వార్తలు కలకలం రేపాయి. పోలీస్ స్టేషన్ లోపలే కస్టడీలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించడం విచారకరం, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అని కేటీఆర్ విమర్శించడంతో బీఆర్ఎస్ దీన్ని బలమైన పొలిటికల్ డిఫెన్స్ అస్త్రంగా మార్చుకోగలిగింది.విచారణాధికారులు , శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం అని బీఆర్ఎస్ ప్రతిదాడి చేస్తోంటే, పోలీసు శాఖ మాత్రం దాడి ఆరోపణలను ఖండించి సీసీటీవీ ఆధారాలను తెరపైకి తెచ్చింది. అయినప్పటికీ, ప్రభుత్వం




తమను వేధిస్తోందని చూపించే అవకాశం బీఆర్ఎస్‌కు దొరికింది. కేవలం ఒక నిరసన ఘర్షణను రాజకీయంగా వినాశకరమైన నేరం గా చిత్రీకరించబోయి, బీఆర్ఎస్ స్థానిక శ్రేణులకు సరికొత్త కసిని, సానుభూతిని కాంగ్రెస్ నాయకత్వమే అందించినట్లయింది. ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్న ప్రభుత్వం, తానే సెల్ఫ్ గోల్ వేసుకుని ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. రాజకీయాల్లో అతిగా స్పందించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సిట్ విచారణలు, సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ వంటి విజువల్స్ ద్వారా మీడియాలో మైలేజ్ సాధించవచ్చని భావించినా, అది కాస్తా వికటించి ప్రజాప్రతినిధుల సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయానికి దారితీసింది. శాంతిభద్రతల నిర్వహణలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు మైలేజ్ ఇచ్చేలా ప్రవర్తించడం వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఘటనను ఆసరాగా చేసుకుని ప్రతిపక్షం నోళ్లు మూయించాలనే కాంగ్రెస్ ప్రయత్నం, బీఆర్ఎస్‌కు తమ క్యాడర్‌ను తిరిగి సమీకరించుకోవడానికి ఒక మంచి అవకాశాన్ని ఇచ్చింది. ఈ ఓవర్ యాక్షన్ మూలంగా రాజకీయ లాభం కంటే కాంగ్రెస్ పార్టీ నష్టపోయే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. తక్షణమే ఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయకపోతే, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల సానుభూతి వేవ్‌కు కాంగ్రెస్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంది.

# డీలిమిటేషన్ బిల్లుతో కమలానికి గులాబీ పువ్వులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** ప్రస్తుతం ఉన్న నిష్పత్తి ప్రకారం డీ లిమిటేషన్ చేస్తే తాము మద్దతిస్తామని కేటీఆర్ ప్రకటించారు. గతంలో యాభై శాతం పార్ములా వెనుక కూడా పెద్ద కుట్ర ఉందని ఆరోపించిన ఆయన ఇప్పుడు.. అదే ప్రకారం చేస్తే నిష్పత్తి మారదు కాబట్టి మద్దతు ఇస్తామన్నట్లుగా ఢిల్లీలో మీడియాకు చెబుతున్నారు. అయితే బీజేపీతో మాత్రం పొత్తు ఉండదని చెబుతున్నారు. ఓ మీడియా సంస్థ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.బీజేపీతో తమ పార్టీ ఎలాంటి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందని, ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదని ఆయన గుర్తుచేశారు. తమ సిద్ధాంతం , వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, భవిష్యత్తులో కూడా బీజేపీతో జతకట్టే ప్రసక్తే లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వాన్ని బీజేపీ వైపు నెట్టేస్తున్నారంటూ ఆయన సోదరి కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై గట్టిగా సమాధానమివ్వలేకపోయారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలకు అంశాలవారీగా మద్దతు ఇస్తున్నామని కేటీఆర్ వివరించారు. గతంలో జీఎస్‌టి, నోట్ల రద్దు వంటి అంశాల్లో బీజేపీకి మద్దతిచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. నోట్ల రద్దుకు మద్దతివ్వడం ఒక పొరపాటని, అనుభవాల నుంచి నేర్చుకుంటామని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 21 శాతం మేర ఓట్లు తొలగించారని , ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే ఓట్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అనర్హుల పేరిట సరైన విధానం పాటించకుండా ఓట్లను తొలగించి ఉంటే, దానికి వ్యతిరేకంగా అవసరమైతే కోర్టులను కూడా

ఆశ్రయించడానికి తమ పార్టీ వెనుకాడదని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీసుకునే ప్రజామోదయోగ్యమైన బిల్లులకు పార్లమెంట్‌లో ఉన్న తమ ముగ్గురు రాజ్యసభ ఎంపీల ద్వారా మద్దతు ఇస్తామని, కానీ రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం ఆ పార్టీకి పూర్తి ప్రత్యర్థిగా ఒంటరిగానే పోరాడతామని కేటీఆర్ తమ విధానంగా చెబుతున్నారు. కానీ ఎన్నికల దగ్గరకు వచ్చే సరికి ఏం జరుగుతుందో చెప్పడం కష్టం. రాజకీయం లెక్క వేరు.

# కాంగ్రెస్‌కు రివర్స్ అవుతున్న అతి రాజకీయం!

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** రాజకీయాల్లో వ్యూహాత్మక పైచేయి సాధించడం ఎంత కళో, దక్కిన ఆ ఆధిక్యతను పదిలపరుచుకుంటూ నిలబెట్టుకోవడం అంతకంటే పెద్ద పరిపక్వత. ఎదుటి పక్షం వేసే ఎత్తులకు పైఎత్తులు వేసి ఇరుకున పెట్టినప్పుడు వచ్చే మైలేజీని హుందాగా మలుచుకోవాలి తప్ప, అత్యుత్సాహంతో అతి చేస్తే అది అంతిమంగా చెట్టుకొట్టి మీదేసుకున్న చందంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో సాగిస్తున్న తాజా ఘర్షణల పర్వంలో సరిగ్గా ఇదే జరుగుతోందన్న భావన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన వివాదంలో బీఆర్ఎస్ స్వయంకృతాపరాధంతో ఇరుక్కుపోయి, కాంగ్రెస్‌కు అయాచితంగా భారీ పొలిటికల్ అడ్వాంటేజ్ దక్కినప్పటికీ.. ఆ తర్వాత సాగుతున్న పరిణామాలు ఆ పైచేయిని చేజేతులా పోగొట్టుకునే దిశగా సాగుతున్నాయి.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసినట్లుగా వచ్చిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా దళిత ఆత్మగౌరవ పోరాటంగా మలిచింది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత నేతను అవమానించారంటూ అధికార పక్షం సంధించిన అస్త్రం బీఆర్ఎస్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అసెంబ్లీలో 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, సభలో ఆమోదించిన తీర్మానాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు దండోరా మోగిస్తూ సాగిన నిరసనలతో రాజకీయంగా రావాల్సినంత మైలేజ్ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరు, చొక్కాలు విప్పి చేసిన ఆందోళనలు ప్రజల్లో ఆ పార్టీకి తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారాయి. ఇక్కడితో ఆగి ఉంటే.. నైతికంగా, రాజకీయంగా కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించి ఉండేది.కానీ, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. వచ్చిన రాజకీయ పైచేయిని కాపాడుకోవాల్సింది పోయి.. వ్యవహారాన్ని సాగదీసి తెగేదాకా లాగడమే కాంగ్రెస్ వ్యూహకర్తల అతిపెద్ద వైఫల్యంగా కనిపిస్తోంది. సాధారణంగా సభా ప్రాంగణంలో జరిగే నిరసనలు, వాగ్వాదాలను రాజకీయంగా ఎదుర్కోవాలి లేదా ప్రివిలేజ్ కమిటీలు, చైర్మన్, స్పీకర్ విచారణల పరిధిలో క్రమశిక్షణా చర్యలతో ముగించాలి. కానీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయించి, ఇద్దరు ఎమ్మెల్సీలను తెల్లవారుజామునే అరెస్ట్ చేయించడం.. కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలపై , పోలీసులతో ఫిర్యాదులు చేయించి కేసులు బనాయించడం ద్వారా వ్యవహారం అతి రాజకీయ

పగ గా మారిపోయింది.ఒక దశ దాటిన తర్వాత చట్టపరమైన అతి దూకుడు ఎప్పుడూ ఎదురుదెబ్బే కొడుతుంది. అసెంబ్లీ ముట్టడి వెనుక పెద్ద కుట్ర ఉందని, పోలీసులను ఉద్దేశపూర్వకంగా కాలర్‌లు పట్టుకుని తోసేశారని కేసులు నమోదు చేసి కోర్టులు, రిమాండ్లు అంటూ ముందుకు వెళ్లడం వల్ల.. సహజంగానే ప్రజాక్షేత్రంలో బాధితులెవరో, వేధిస్తున్నదెవరో అనే సరిహద్దులు చెదిరిపోతాయి. రాజకీయాల్లో ప్రత్యర్థి తప్పు చేసినప్పుడు ఆ తప్పును ఎత్తిచూపి ప్రజా క్షేత్రంలో దోషిగా నిలబెట్టడం వరకే పరిమితం కావాలి. అంతేకానీ, అదే తప్పును సాకుగా తీసుకుని పోలీసు వ్యవస్థను ప్రయోగించి కక్షసాధింపులకు దిగితే.. ప్రజల్లో ప్రభుత్వ పరిపక్వతపై అనుమానాలు మొదలవుతాయి. తాము సాధించిన దళితవాద ఆధిపత్యాన్ని అరెస్టుల రూపంలో కరిగిపోకుండా కాపాడుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందన్నది కాదనలేని సత్యం.

# 22ఏ భూముల వివాదాలకు పరిష్కారం.. 30 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఆస్తుల వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. సీసీఎల్ఏ, న్యాయశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. యూఎల్‌సీ భూములు, ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూములు, సింగరేణి కోల్‌బెల్ట్, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇళ్లు, నాలా రుసుములు, అనధికార లేఅవుట్లు, లీజ్‌హోల్డ్ ఆస్తులు, భూదాన్ భూములు తదితర 12 అంశాలపై ప్రభుత్వం పరిష్కార చర్యలు ప్రకటించింది.తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో చేరిన నిరుపేదల ఆస్తుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ అంశంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. 22ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారితో హైపవర్ ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేదలకు సంబంధించిన న్యాయబద్ధమైన కేసుల్లో అన్యాయం జరగకుండా నిర్ణీత గడువుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు.భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎలా మారాయన్న అంశాలను సీఎం రేవంత్ సభలో వివరించారు. ఈ చారిత్రక పరిణామాల నేపథ్యంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న వివిధ రకాల భూములు, ఆస్తుల సమస్యలను ప్రభుత్వం విడివిడిగా పరిశీలించనుంది.

ప్రధాన అంశాలపై చర్యలు తీసుకునే ప్రతిపాదనలను వెల్లడించిందిఅర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) మిగులు భూముల విషయంలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు వర్తించేలా కొత్త విధానం తీసుకురానుంది. పాత పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులనూ ఈ విధానంలో పరిగణనలోకి తీసుకోనుంది. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.అధికారికంగా ఆమోదం పొందిన లేఅవుట్లలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పరిష్కారానికి వారం రోజుల్లో సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని పెండింగ్ కేసుల పరిశీలనకు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయనుంది.జీవో 59 కింద కన్వేయన్స్ డీడ్స్ జారీ అయిన 1,22,280 దరఖాస్తులను అర్హతల ఆధారంగా తుది పరిశీలన చేయనుంది. మరో 18,590 పెండింగ్ దరఖాస్తులను కొత్త క్రమబద్ధీకరణ విధానంలో పరిష్కరించాలని నిర్ణయించింది. జీవో 118కు సంబంధించిన పెండింగ్ కేసులను పరిష్కరించి, అర్హత సాధించిన ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించనుంది.అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్ల విషయంలో 1977 నాటి చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయ సమీక్ష, విస్తృత సంప్రదింపుల అనంతరం నిర్ణయం తీసుకోనుంది. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు సంబంధించిన అంశాలపైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. సొంత స్థలంలో నిర్మించిన ఇళ్లకు ఐదేళ్ల లాక్-ఇన్ గడువు పూర్తయిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతించే ప్రతిపాదనను ప్రకటించింది.ప్రైవేటు పట్టా భూముల్లో నాలా రుసుములు చెల్లించని కేసుల్లో సంబంధిత నాలా ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించే విధంగా క్రయవిక్రయాలకు మార్గం కల్పించనుంది. ప్రభుత్వ భూముల్లోని అనధికార లేఅవుట్లు, కాలనీలను కొత్త క్రమబద్ధీకరణ పథకంలోకి తీసుకురావాలని నిర్ణయించింది.సికింద్రాబాద్ పరిధిలోని లీజ్‌హోల్డ్ ఆస్తులను ఫ్రీహోల్డ్‌గా మార్చే కేసులకు 30 రోజుల గడువులో పరిష్కారం చూపేందుకు కమిటీ ఏర్పాటు చేయనుంది. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల అసైన్డ్ భూములు, భూదాన్ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానంలోకి తీసుకొచ్చే ప్రతిపాదనను కూడా ప్రభుత్వం వెల్లడించింది. ఈ విధానం ద్వారా సమీకరించే వనరులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేదల గృహ నిర్మాణ అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు.కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## పీచే మూడ్ లో రెబల్ గులాబీలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం హాట్ టాపిక్ గా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్ అధిష్టానానికి సొంత కేడర్ నుంచే తీవ్రమైన వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో పార్టీ మారిన కొందరు ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి చేరుకునేందుకు ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఉండే స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాత్రం వారి రాకను బలంగా అడ్డుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తమను వదిలి వెళ్లిన నాయకులకు మళ్లీ రెడ్ కార్పెట్ వేయడంపై కేడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.కాంగ్రెస్ పార్టీలో చేరిన కొందరు ఎమ్మెల్యేలకు అక్కడ పరిస్థితులు సరిపడకపోవడంతో, వారు మళ్లీ బీఆర్ఎస్ అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జూలై 2024లో కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇటీవల కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా కేసీఆర్‌ను తాను మోసం చేయలేనని, తనకు అన్నం పెట్టిన వ్యక్తిని మరిచిపోలేనని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సైతం కేసీఆర్‌కు మద్దతుగా మాట్లాడటం, గత నెల జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కన్నీటి పర్యంతం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ పరిణామాలపై పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి తిరిగి వస్తామంటున్న నేతలపై ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక శ్రేణుల అభిప్రాయాలు తీసుకోవాలని అధిష్టానం భావించింది. ఇందులో భాగంగా పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలు, స్థానిక నాయకులతో ప్రత్యేకంగా చర్చిస్తున్నారు. అయితే ఫిరాయింపుదారులను పార్టీలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తీసుకోవద్దని మెజారిటీ స్థానిక నాయకులు తెగేసి చెబుతున్నారు.పార్టీని నమ్ముకుని ఉన్న క్యాడర్‌ను కాదని, అవకాశవాద రాజకీయాలు చేసిన వారికి మళ్లీ ప్రాధాన్యత ఇస్తే సంస్థాగతంగా తీవ్ర నష్టం జరుగుతుందని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బదులుగా, నియోజకవర్గాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, కొత్త వాళ్లను తయారు చేయాలని వారు అధిష్టానానికి గట్టిగా సూచిస్తున్నారు. ఒకవైపు నేతల రాకకోసం కొందరు ప్రయత్నిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయి నేతల వ్యతిరేకత కారణంగా బీఆర్ఎస్ అధిష్టానం ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## నెరవేరనున్న దశాబ్దాల నాటి కల..

### నిజామాబాద్ పట్టణం చుట్టూ రూ.2500 కోట్లతో ఔటర్ రింగు రోడ్డు..!

**నిజామాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనకు మళ్లీ జీవం పోసుకుంది. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ చొరవతో ఆర్అండ్‌బీ అధికారులు తాజా అంచనాలు, భూసేకరణపై కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే జాతీయ రహదారి-44 అనుసంధానం మెరుగై.. భారీ వాహనాల దారిమళ్లింపు ద్వారా నగరంలో రద్దీ తగ్గడంతో పాటు రవాణా, పారిశ్రామికాభివృద్ధి వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.నిజామాబాద్ నగరవాసుల దశాబ్దాల కల అయిన ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు ప్రతిపాదనకు మళ్లీ కదలిక వచ్చింది. తాజాగా.. నగరపాలక సమీక్ష సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు తాజా అంచనాలు, భూసేకరణ వివరాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో తెరపైకి వచ్చిన ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే ఎన్‌హెచ్-44తో అనుసంధానం ఏర్పడి, నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు పారిశ్రామిక, రవాణా రంగాలకు ఊతం లభిస్తుందని ఇందూరు ప్రజలు కోరుకుంటున్నారు.వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదన తొలిసారి తెరపైకి వచ్చి అంచనాలు రూపొందించినప్పటికీ.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో పురోగతి నోచుకోలేదు. నగరంలో అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డు, శివారు మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనుల జాప్యం నేపథ్యంలో ఓఆర్ఆర్ అంశంపై జిల్లాలో తరచూ రాజకీయ చర్చలు జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు. ఈ రింగ్ రోడ్డు ప్రాజెక్టు సాకారమైతే కామారెడ్డి, హైదరాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి-44తో పాటు ఇతర ప్రధాన మార్గాలన్నింటికీ సజావుగా కనెక్టివిటీ లభించనుంది. దీనివల్ల పారిశ్రామిక ఉత్పత్తులు, వస్తువులు అలాగే ప్రజా రవాణా వ్యవస్థ మరింత సులభతరంగా మారనుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా మళ్లించడం ద్వారా నిజామాబాద్ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది.అంతేకాకుండా ఆర్మూర్‌తో పాటు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వైపు రహదారి సౌలభ్యం మరింత మెరుగవుతుంది. దీనిద్వారా స్థానిక రైతులు తమ పంట ఉత్పత్తులను ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా మార్కెట్లకు తరలించుకునే అవకాశం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి రైతుల నుంచి ఎంత మేర భూమిని సేకరించాల్సి ఉంటుందనే వివరాలపై అధికారులు తాజాగా కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించి, ఆమోదం పొంది నిధులు రాబట్టేలా చర్యలు వేగవంతం చేయాలని ఇందూరు వాసులు కోరుతున్నారు.

## జై బోలో గణేష్ మహారాజ్ కీ జై!
## ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖైరతాబాద్ గణేష్ అంటే మన తెలంగాణలోనే కాదు, యావత్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన గణపతి ఉత్సవం. బడా గణేష్ అంటే ఖైరతాబాద్.. ఖైరతాబాద్ అంటే బడా గణేష్. బడా గణేష్ మాత్రమే కాదు.. బడియా గణేష్ కూడా. హైదరాబాద్ అంటే చార్మినార్, గోల్కొండ కోట ఎంత ప్రత్యేకమో.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడంలో ఖైరతాబాద్ బడా గణేష్ కూడా అంతే ప్రత్యేకమైన భాగమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.గురువారం అయన ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకున్నారు. హరీష్ రావు మాట్లాడుతూ ఈ బడా గణేష్‌ను దర్శించుకోవడానికి తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. ఇంతటి ఘనమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ ఏడాది 69 అడుగుల పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించడం విశేషం. అంతేకాదు, మట్టితో గణపతిని తయారు చేసి పూజించడం పర్యావరణ పరిరక్షణకు చక్కటి సందేశం. భక్తి శ్రద్ధలతో మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ఈ పంచముఖ సంకట మహాగణపతి, పంచముఖ హనుమంతుడు ప్రజలందరినీ దీవించాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా గణేష్ మండపాల నిర్వాహకులకు ఒక విజ్ఞప్తి. ఉత్సవాలు ఎంత ఘనంగా నిర్వహిస్తున్నామో.. నిమజ్జన కార్యక్రమాల్లో అంతే జాగ్రత్తలు తీసుకోవాలి. భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నిన్న పటాన్‌చెరులో నిమజ్జనం సందర్భంగా జరిగిన అనుకోని ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. ప్రజలందరూ సురక్షితంగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు.

# గుంటూరులో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, పెన్ పవర్ సెప్టెంబర్ 18:**గుంటూరులోని సమర్థనం ట్రస్ట్ ఫర్ ది డిసేబుల్డ్ శాఖలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ అలీమ్, ఎం.ఆర్.కె. పరమహంస, మాగంటి సుధాకర్, సమర్థనం ట్రస్ట్ బెంగళూరు ప్రధాన కార్యాలయం నుంచి సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు నరేంద్ర మోదీ నాయకత్వం, దార్శనికత, మైనారిటీ వర్గాల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతతో పాటు దేశానికి అందిస్తున్న సేవలను వివరించారు. సమర్థనం ట్రస్ట్ సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు.

# భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు

# మీనాక్షి స్థానంలో ముకుల్ వాస్నిక్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మార్పు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్టడీ టూర్ నిమిత్తం లండన్ వెళ్లనుండటం, రాబోయే దాదాపు పది నెలల పాటు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడం ఏఐసీసీ కి అత్యవసరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ.. నిత్యం ఉద్భవిస్తున్న అంతర్గత విభేదాలు, వర్గపోరు, మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నూతన ఇన్‌ఛార్జ్ ఎంపికపై హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నేత ముకుల్ వాస్నిక్ పేరు చాలా ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్ రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మాజీ మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎన్ఎస్‌యూఐ , యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు.. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక సంక్లిష్ట రాష్ట్రాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఎలాంటి వివాదాలు లేకుండా పని చేసిన ట్రాక్ రికార్డు ఆయనకుంది. తెలంగాణ వంటి రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఒక ట్రబుల్ షూటర్ అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని వర్గానికి, అలాగే పార్టీలోని పాత కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరును సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయడం కొత్త ఇన్‌ఛార్జ్‌కు మొదటి సవాలు. ముకుల్ వాస్నిక్‌కు తెలంగాణలోని దాదాపు అందరు సీనియర్ నాయకులతో మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నందున, ఆయన సమన్వయకర్తగా ఉంటే ఇరు వర్గాలను సమానంగా కలుపుకొని పోగలరనే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మరొక ప్రధానమైన అంశం.. పార్టీ మరియు ప్రభుత్వం మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం. నామినేటెడ్ పదవుల భర్తీ, కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు, మరియు జిల్లా స్థాయిలో కేడర్‌కు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి పాత నాయకుల్లో బలంగా ఉంది. వివాదరహిత ఇమేజ్ కలిగిన వాస్నిక్ వంటి సీనియర్ నేత బాధ్యతలు చేపడితే, ప్రభుత్వ నిర్ణయాల్లో పార్టీ ప్రాధాన్యతలను సమతుల్యం చేస్తూ సంక్షోభాలను సునాయాసంగా నివారించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, బిసి-దళిత అజెండాతో ముందుకు సాగుతున్న తరుణంలో.. జాతీయ స్థాయిలో సీనియర్ దళిత ముఖమైన ముకుల్ వాస్నిక్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా సామాజికంగా కూడా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారనుంది. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందించాలంటే పక్కా రోడ్‌మ్యాప్, సీట్ల సర్దుబాటులో పారదర్శకత అవసరం. దీనికి వాస్నిక్ అనుభవం ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేందుకు ఏఐసీసీ సిద్ధమవుతోంది. ముకుల్ వాస్నిక్ ఎంట్రీ ఖాయమైతే, రేవంత్ రెడ్డి నాయకత్వానికి, సీనియర్ల అసంతృప్తులకు మధ్య బలమైన వంతెనగా మారి పార్టీని స్థానిక పోరు వైపు విజయవంతంగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# సిద్దిపేటలో హరీష్‌రావుకు.. చిక్కుముళ్లు.. రీజనేంటి?




తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు తన్నీరు హరీష్‌రావు రాజకీయాలు ఎలా ఉన్నా.. ఆయన సొంత నియోజకవర్గం సిద్దిపేటలో మాత్రం అప్రమత్తంగా ఉండక తప్పదని అంటున్నారు పరిశీలకులు. ఇక్కడి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అధికార కాంగ్రెస్, బీఆర్ ఎస్ మధ్య తీవ్రంగా మారాయి. దీనికితోడు గత ఎన్నికల్లో మూడోస్థానానికి పరిమితమైన బీజేపీ.. ఇప్పుడు కోలుకుని ముందుకు సాగాలని.. వచ్చే ఎన్నికల్లో బలంగా పుంజుకోవాలని నిర్ణయించుకుంది.

వీరికితోడు.. తెలంగాణ రక్షణ సేన నాయకురాలు కవిత సైతం.. తన టార్గెట్ సిద్దిపేటేనని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తానేపోటీ చేస్తానని కూడా కవిత కొన్నాళ్ల కిందట ప్రకటించారు. దీంతో హరీష్‌రావుకు అటు కాంగ్రెస్, బీజేపీలతో పాటు.. ఇటు కవిత ప్రభావాన్ని కూడా ఎదుర్కొనక తప్పదని అంటున్నారు పరిశీలకులు. నిజానికి సిద్దిపేటనియోజకవర్గం హరీష్ రావు కంచుకోట. పార్టీ ఓడినా.. ఆయన మాత్రం విజయం దక్కించుకున్నారు. ఆమాటకొస్తే.. సిద్దిపేట నియోజకవర్గం మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీకి కూడా గట్టి మద్దతుగా నిలుస్తోంది. అయితే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. బీఆర్ ఎస్ అగ్రనేతలను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే హరీష్ రావు నియోజకవర్గంపైనా దృష్టి పెట్టింది. తరచుగా కీలక నాయకులు, మంత్రులు ఇక్కడ పర్యటిస్తున్నారు. రాబోయే రోజుల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఇక్కడ భారీ బహిరంగ సభలను నిర్వహించడానికి ప్లాన్ చేస్తున్నారు. అంతేకాదు.. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే, ఇక్కడి నుండి వచ్చే ఎమ్మెల్యేకు రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇస్తామని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

**హరీష్ పనితీరు ఇదీ..**

ఎమ్మెల్యేగా హరీష్ రావు సాదాసీదాగా ఉండడంతోపాటు.. ప్రజలకు చేరువ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలో నిరంతరం పర్యటిస్తూ, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ తన పట్టును కాపాడుకుంటున్నారు. ఇక, బీజేపీ 2023 ఎన్నికల్లో ఇక్కడ మూడో స్థానానికే పరిమితమైనప్ప టికీ.. ప్రభుత్వంపై వ్యతిరేక పోరాటాల్లో యాక్టివ్‌గా ఉంటోంది. ఇటీవల భూ సమస్యలు, 22ఏ నిబంధనలకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం సిద్దిపేటలో భారీ ధర్నాలు నిర్వహించి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో హరీష్‌రావుకు వచ్చే ఎన్నికల నాటికి ఈ చిక్కుముళ్లు మరింత పెరగనున్నాయని అంటున్నారు పరిశీలకులు.

# తెలంగాణలో తొలిసారి.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు.. ఆ 8 మంది ఎమ్మెల్యేల్లో టెన్షన్?



తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ అంశమే ఆయన అనర్హత కేసులో కీలకంగా మారింది.

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు విధించడంతో పాటు ఆయనపై స్పీకర్ తీసుకున్న గత నిర్ణయాన్ని పక్కనపెట్టింది. కోర్టు తీర్పు ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించబడతారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**అసలు వివాదం ఏంటి?**

2023లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్.. 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు. అయితే ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచి ఉండగానే మరో పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ఆయనపై అనర్హత పిటిషన్లకు దారితీసింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ మాత్రం వారి పిటిషన్లను తిరస్కరించారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది.

**మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల సంగతేంటి?**

ఇక్కడే తెలంగాణ రాజకీయాల్లో అసలు చర్చ మొదలైంది. కాంగ్రెస్‌లో చేరిన ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా ఫిరాయింపు ఆరోపణలకు సంబంధించి అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆ కేసులపై కూడా రాజకీయంగా ఆసక్తి పెరిగింది. అయితే మిగిలిన ఎమ్మెల్యేలందరిపై కూడా ఇదే తీర్పు తప్పనిసరిగా వస్తుందని ఇప్పుడే చెప్పలేం. ప్రతి కేసులో ఉన్న వాస్తవాలు, ఆధారాలు, పిటిషన్ల స్వభావం, సంబంధిత ఎమ్మెల్యేల చర్యలను విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయినప్పటికీ దానం కేసు తీర్పు ఇతర ఫిరాయింపు కేసుల్లో న్యాయపరమైన వాదనలకు ప్రాధాన్యత కలిగించే పరిణామంగా మారింది. బీఆర్ఎస్ నేతలు మాత్రం దానం నాగేందర్‌కు ఎదురైన పరిణామం మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కూడా ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. అందుకే "ఆ 8 మంది ఎమ్మెల్యేల్లో టెన్షన్" అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

**ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక?**

హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది. దీంతో తదుపరి దశలో ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

ఉప ఎన్నిక జరిగితే అది కేవలం ఒక నియోజకవర్గ ఎన్నికగానే కాకుండా పార్టీ ఫిరాయింపుల అంశంపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే రాజకీయ పోటీగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో దానం నాగేందర్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది. అటువంటి పరిణామం చోటుచేసుకుంటే తదుపరి న్యాయపోరాటం ఎలా సాగుతుందనేది కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి పక్షాలు కూడా న్యాయపరమైన తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నాయి.

**తెలంగాణ రాజకీయాలపై ప్రభావం ఎంత?**

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక ఎమ్మెల్యేపై అనర్హత వేటు విషయంలో హైకోర్టు నుంచి ఇలాంటి తీర్పు రావడం ఇదే తొలిసారిగా వార్తల్లో నిలిచింది. దీంతో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల కేంద్రబిందువుగా మారింది. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు ఒక వ్యక్తి ఎమ్మెల్యే పదవికే పరిమితం కాకుండా పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలపై కూడా దృష్టిని మళ్లించింది. ముఖ్యంగా స్పీకర్ నిర్ణయాలను న్యాయస్థానాలు ఎలా పరిశీలించగలవన్న అంశంపై కూడా ఈ తీర్పు చర్చకు దారితీసింది. ఇక ముందున్న రోజుల్లో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై ప్రక్రియ, దానం నాగేందర్ తదుపరి న్యాయపరమైన అడుగులు, అలాగే మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుల్లో వచ్చే పరిణామాలు తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించే అవకాశముంది. ప్రస్తుతం మాత్రం దానం నాగేందర్‌పై వచ్చిన తీర్పు.. పార్టీ ఫిరాయింపుల అంశంలో తెలంగాణ రాజకీయాలకు కీలక మలుపుగా మారింది.

# ఫామ్ హౌస్‌లో సగానికిపైగా స్వాధీనం ఖాయం?

**మెదక్, హైదరాబాద్, సెప్టెంబర్ 17, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా అత్యంత ఆసక్తికరమైన, అంతకుమించి రహస్యమైన కేంద్రం ఏదైనా ఉందంటే అది సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్. ప్రారంభంలో కొద్దిపాటి ఎకరాల విస్తీర్ణంలో, కేవలం రెండు అంతస్తుల సాధారణ గెస్ట్‌హౌస్‌తో మొదలైన ఈ వ్యవసాయ క్షేత్రం.. కాలక్రమేణా వేల మీటర్ల పొడవాటి ప్రహరీ గోడలు, పటిష్టమైన నిఘా వ్యవస్థ, అత్యాధునిక రాజభవన సముదాయాలతో ఒక అభేద్యమైన కోటలా రూపాంతరం చెందింది. పార్టీలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం కేవలం ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన షెడ్డు వరకే అనుమతి ఉంటుంది. లోపల కనుచూపు మేరలో విస్తరించి ఉన్న ఆకుపచ్చని తోటలు, నిర్మాణాల లోగుట్టు సొంత పార్టీ శ్రేణులకు కూడా చిక్కేది కాదన్నది బహిరంగ సత్యం. పాలనా పగ్గాలు చేతిలో ఉన్నప్పుడు ఫామ్‌హౌస్ కేంద్రంగా సాగిన పాలన పై నిరంతరం ఎదురుదాడి చేసిన విపక్షాలకు, అది ఎప్పుడూ ఒక ఛేదించలేని రహస్య కేంద్రంగానే మిగిలిపోయింది. ఈ సుదీర్ఘ మిస్టరీకి తెరదించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విచారణాస్త్రం సంధించడంతో ఎర్రవల్లి కోట చుట్టూ ఉన్న పొగమంచు వీడబోతోంది. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం అసలు పరిమాణం ఎంత? అందులో కేసీఆర్ స్వయంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి ఎంత? కౌలు పేరిట చేజిక్కించుకున్నది ఎంత?

బినామీల పేరిట చుట్టుపక్కల విస్తరించిన భూభాగం ఎంత? అన్న లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఫామ్‌హౌస్ పరిధి సుమారు 700 ఎకరాలకు పైగా విస్తరించి ఉందని, అందులోనే ఏకంగా 340 నుంచి 388 ఎకరాల మేర అసైన్డ్, ప్రభుత్వ భూమి కలిసిపోయి ఉందన్న రేవంత్ ఆరోపణలతో అధికార యంత్రాంగం సమగ్ర భూ సర్వేకు నడుం బిగించింది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ విభాగాలకు 30 రోజుల స్పష్టమైన డెడ్‌లైన్ విధించడం ఈ విచారణ తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి ఆస్తిపాస్తుల పరిశీలన మాత్రమే కాదు. ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణి పోర్టల్ సమగ్రతపై జరుగుతున్న అతిపెద్ద న్యాయ-పరిపాలనా పరీక్ష. తెలంగాణ అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక కుటుంబ యూనిట్‌కు గరిష్ట పరిమితి ఉండగా, కేసీఆర్ కుటుంబం అధికారికంగానే దాదాపు 439 ఎకరాలను ఎలా కలిగి ఉందన్న సాంకేతిక చిక్కును కాంగ్రెస్ ప్రభుత్వం లేవనెత్తుతోంది. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా రికార్డులను నిషేధిత జాబితా నుంచి తొలగించారా? స్థానిక రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములకు చట్టబద్ధమైన బదలాయింపులు జరిగాయా? లేక అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని హద్దులు విస్తరించారా? అనే అంశాలపై డ్రోన్ సర్వేలు, పాత పహాణీల రికార్డులు పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే

అవకాశముంది. ఒకవేళ విచారణలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణ నిజమని తేలితే, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని దళిత, పేద వర్గాలకు పంచుతామన్న ప్రభుత్వ ప్రకటన బీఆర్ఎస్ అధినేతను ఆత్మరక్షణలోకి నెడుతుంది. ఇన్నాళ్లూ ప్రగతిశీల వ్యవసాయం , ఆధునిక సేద్యం పేరుతో ప్రచారం చేసుకున్న మోడల్ ఫామ్‌హౌస్ వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు అధికారిక డాక్యుమెంట్ల సాక్షిగా బట్టబయలు కానుంది. రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ దూకుడు అడుగుతో, దశాబ్ద కాలంగా ఎవరికీ అంతుచిక్కని కేసీఆర్ ఫామ్‌హౌస్ రహస్యాలు ప్రజాక్షేత్రంలో బట్టబయలయ్యే ఘట్టం సమీపించినట్లే కనిపిస్తోంది.

# లోకేశ్, జగన్ పై ఏబీవీ సెటైర్లు..!! ఆ విషయంలో ఇద్దరూ ఒకటే అంట..

**హైదరాబాద్ పెన్ పవర్:** రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) సోషల్ మీడియా అస్త్రంగా చేసుకుని సంధిస్తున్న విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా అవుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడిగా ముద్రపడిన ఆయన గత కొంతకాలంగా అనుసరిస్తున్న విధానం ద్వారా తనకు ప్రభుత్వ పెద్దలకు మధ్య ఏ సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో తన ప్రధాన ప్రత్యర్థిగా ప్రకటించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై కాస్త మెతక వైఖరి తీసుకున్నారని జరుగుతున్న ప్రచారంలో పసలేదని సంకేతాలిస్తున్నారు. సందర్భం దొరికితే చాలు తనకు ఎవరైనా ఒకటేనన్న వైఖరి ప్రదర్శిస్తున్నారని చెబుతున్నారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవి ఇచ్చినా తీసుకోని ఏబీవీ.. సొంతంగా రాజకీయ పార్టీని పెడతానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పార్టీ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయో కానీ, ప్రస్తుతం ఆయన ప్రజాసమస్యలను వెలుగులోకి తేవడంలో బిజీగా ఉంటున్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలను సోషల్ మీడియా వేదికగా వెలుగులోకి తెస్తున్న ఏబీవీ అధికార, విపక్షాల తప్పులను ఎత్తిచూపుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన తాజాగా వివిధ సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పంచుకున్న ఓ విషయంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాజకీయ పార్టీలతోపాటు రాష్ట్రంలోని రెండు ప్రధాన పత్రికల పనితీరును ఎండగడుతూ ఏబీవీ పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. రాష్ట్రానికి చెందిన ఒక కాంట్రాక్టు సంస్థపై ఈడీ సోదాలు జరిగితే పత్రికల్లో వార్తలు రాయలేదని, ఈ విషయంలో క్రెడిట్ ఎవరు తీసుకుంటారని మంత్రి లోకేశ్, విపక్ష నేత జగన్ రెడ్డిని ప్రశ్నిస్తూ ఏబీవీ తన ఎక్స్, ఫేస్ బుక్ అకౌంట్లలో పోస్టు పెట్టారు. అంతేకాకుండా తాను మూడు ముక్కల్లో చెప్పిన అంశానికి సంబంధించి ఒక ఆన్ లైన్ పేపరులో సమగ్ర కథనం ఉందని చెబుతూ ఆ లింకు షేర్ చేశారు. దీంతో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు కొన్ని కాంట్రాక్టు సంస్థల విషయంలో ఒకే అజెండాతో పనిచేస్తున్నాయని, ప్రజా సమస్యలు కన్నా, కాంట్రాక్టు సంస్థల



ప్రయోజనాలు కాపాడేందుకు పోటీ పడుతున్నాయని రిటైర్డ్ డీజీ ఏబీవీ చెబుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నెల 12న ఓ కాంట్రాక్టు సంస్థపై హైదరాబాద్, కోల్ కత్తా కార్యాలయాల్లో ఈడీ సోదాలు జరిగితే ఆ సమాచారం ఇటు అధికార పార్టీకి చెందిన ఓ పత్రికలోనూ, అటు విపక్షం యాజమాన్యంలో నడుస్తున్న పత్రికలోనూ కవర్ అవ్వలేదని ఏబీవీ చెబుతున్నారు. దీనిపై క్రెడిట్ ఎవరు తీసుకుంటారంటూ మంత్రి లోకేశ్, విపక్ష నేత జగన్ రెడ్డిని ఆయన తన ట్వీటులో ప్రశ్నించారు.రాష్ట్రంలో ఏ పని జరిగిన క్రెడిట్ మాదంటే మాదని వాదులాడుకునే మంత్రి లోకేశ్, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఈ విషయంలో ఏం చెబుతారని ఏబీవీ సంధించిన ప్రశ్న తీవ్ర ఆసక్తి రేపుతోందని అంటున్నారు. "దీన్ని గురించి జగన్ గారి ప్రెస్ మీట్, లోకేష్ గారి బస్తీ మే సవాల్, ఇరువైపులా

భక్త జనుల హోరా హోరీ చూడాలని ప్రజల ఉత్సుకతతో ఉన్నారంటూ ఏబీవీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా "మరి వారి సంతృప్తి స్థాయి ని ఒక ×ఎ=ూ కాల్ ద్వారా అంచనా వేస్తారా? అంటూ సెటైర్ పేల్చారు. అభివృద్ధి పనుల విషయంలో రకరకాల ప్రకటనలు చేసే మంత్రులు, విపక్ష నేతలు ఒక కాంట్రాక్టు సంస్థకు దాసోహమయ్యారా? అనేలా ఏబీవీ పరోక్షంగా ప్రశ్నించారని అంటున్నారు. మొత్తానికి తనకు ఇద్దరూ ఒకటేనని ప్రజల కోసం తన గొంతు వినిపిస్తానని ఏబీవీ మరోసారి స్పష్టం చేశారని అంటున్నారు.

# ఏపీలో మరో మెగా ప్రాజెక్ట్: దుగరాజపట్నంలో రూ.15 వేల కోట్లతో నౌకా నిర్మాణ క్లస్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వ సంబంధాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ప్రధానంగా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొత్త ప్రాజెక్టులకు ఏపీ గమ్యస్థానంగా మారుతోంది. ఇందుకు నిదర్శనంగా.. తాజాగా తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ క్లస్టర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ, నవరత్న కంపెనీ అయిన 'మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్' రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ షిప్‌యార్డ్ నిర్వహణ కోసం ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా 'నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్- ఏపీ' పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేశాయి. దేశంలోని అగ్రశ్రేణి షిప్‌బిల్డర్లలో ఒకటైన, నవరత్న డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌గా ఉన్న మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌ను ప్రతిపాదిత క్లస్టర్ కోసం యాంకర్ షిప్‌యార్డ్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

దుగరాజపట్నంలో ఆధునిక గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను అభివృద్ధి చేయాలని మజగావ్ డాక్ షిప్ బిల్డర్ లిమిటెడ్ (ఎండీఎల్) భావిస్తోంది. వచ్చే ఐదు నుంచి ఏడేళ్లలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఇందుకోసం దశలవారీగా రూ.15 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతోంది. ఈ ఎండీఎల్ షిప్‌యార్డ్ ద్వారా సుమారు 45 వేల మందికి ఉపాధి లభించనుందని అంచనా వేస్తున్నారు. కాగా, ఈ తాజా ప్రాజెక్టు ఒప్పందంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వంతో చక్కని సమన్వయం కొనసాగిస్తున్న ఏపీ ప్రభుత్వం.. వరుసగా అతిపెద్ద ప్రాజెక్టులను దక్కించుకుంటోందని విశ్లేషకులు అంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో, రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న టీడీపీకి దశాబ్దాలుగా మిత్రపక్షంగా అనుబంధం ఉంది. అయితే, గతం కొన్నిసార్లు రెండు పార్టీల మధ్య తలెత్తిన విభేదాల వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడటమే కాకుండా, టీడీపీ నాయకత్వం కూడా రాజకీయంగా సమస్యలను చవిచూసిందని గుర్తు చేస్తున్నారు. కానీ, 2024 ఎన్నికలకు ముందు కుదిరిన పొత్తు, ఆ తర్వాత టీడీపీ మద్దతుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగాల్సిన రాజకీయ పరిస్థితులు ఏర్పడటంతో.. ఇప్పుడు ఏపీ కేంద్ర ప్రభుత్వానికి మొదటి ఛాయిస్‌గా మారినట్లు కనిపిస్తోందని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని చెబుతున్నారు. ప్రైవేటు రంగ పరిశ్రమలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలకు కూడా ఏపీని ప్రధాన కేంద్రంగా మారుస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.గతంలో రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా, సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమతో పాటు ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు కూడా అడుగులు పడ్డాయి. ఇప్పుడు తాజాగా మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడాన్ని విశేషంగా చెబుతున్నారు. కంటైనర్ షిప్‌లు, ట్యాంకర్లు, ఎల్ఎన్‌జీ క్యారియర్లు వంటి పెద్ద వాణిజ్య నౌకల నిర్మాణానికి ఇది ప్రధాన వేదిక కానుంది.

# కీలక నేతలు గుడ్ బై...

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 18, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్‌బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది.ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు.అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. . హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్టానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు.ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాం ఖరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్టానం ముందే ఉంచారు.వైసీపీ అధిష్టానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్టానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్టానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది.

# వైసీపీ కేడర్ లో అయోమయం పోటీకి ద్వితీయ శ్రేణి నేతల అనాసక్తి

**విజయవాడ, సెప్టెంబర్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో తీవ్ర అభద్రతాభావం, కంగారు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుండి స్థానిక నాయకులు, ఇన్‌ఛార్జ్‌లపై వస్తున్న ఆదేశాలు, హెచ్చరికలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తీవ్ర గందరగోళానికి దారితీస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాల్సిందే, వెనకడుగు వేస్తే పార్టీ శత్రువులుగానే భావిస్తాం అంటూ అధిష్ఠానం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేయడం వెనుక వైఎస్ఆర్‌సీపీ ఎదుర్కొంటున్న కఠినమైన రాజకీయ పరిస్థితికి సాక్ష్యంగా కనిపిస్తోంది. సమస్య హైకమాండ్ ఆదేశాల్లో కాదు.. క్షేత్రస్థాయిలో అభ్యర్థులు సిద్ధంగా లేకపోవడంలోనే ఉందనేది స్పష్టమవుతోంది. గ్రామాలు, మండలాల్లో పోటీ చేయగల ఆర్థిక, అంగ బలం ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరూ కూడా ప్రస్తుతం బరిలోకి దిగేందుకు మొగ్గు చూపడం లేదు. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ఆర్‌సీపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోవడం, నియోజకవర్గ స్థాయి అగ్రనేతలు సైతం సైలెంట్ అయిపోవడం , కూటమి వైపు చూడటంతో దిగువ స్థాయి నాయకత్వం తీవ్ర దిక్కుతోచని స్థితిలో పడింది. పోటీకి కావాల్సిన భారీ వ్యయాన్ని భరించి, రాజకీయంగా రిస్క్ తీసుకోవడానికి చాలామంది స్థానిక నేతలు వెనకాడుతున్నారు.పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే.. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పాత ఎమ్మెల్యేలకు కూడా గ్రామాలు, వార్డుల వారీగా అభ్యర్థులను వెతికి పట్టుకోవడం గగనతలమవుతోంది. బలమైన ఆర్థిక స్థోమత ఉన్న నేతలు ఇప్పటికే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీల కండువాలు కప్పుకోవడానికి ప్రాధాన్యత ఇస్తుండగా, మిగిలిన మధ్యస్థ నాయకులు పోటీకి దూరంగా ఉంటూ తటస్థంగా ఉండిపోవాలని భావిస్తున్నారు. పోటీ నుంచి తప్పుకుంటే భవిష్యత్తులో పార్టీలో స్థానం ఉండదు, మిమ్మల్ని శత్రువులుగా చూస్తాం అనే రీతిలో బెదిరింపుల రూపంలో ఒత్తిడి తెస్తుండటంతో వైఎస్ఆర్‌సీపీ క్యాడర్ నలిగిపోతోంది.ఈ భయానికి, ఆందోళనకు 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన స్థానిక ఎన్నికల తీరే ప్రధాన కారణమని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో ఏకగ్రీవాల పేరిట, అధికార బలాన్ని ప్రయోగించి ప్రత్యర్థులను పోటీ చేయకుండా నిరోధించారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడం, కూటమి అధికారంలోకి రావడంతో తాము పోటీకి దిగితే పాత బకాయిలు, రాజకీయ కక్షసాధింపులు, కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ద్వితీయ శ్రేణి నేతలు వెనకడుగు వేస్తున్నారు. మరొక ప్రధానమైన అంశం.. నామినేషన్ల ఖర్చులు, ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని పార్టీ పరంగా భరిస్తారా లేదా అనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇవ్వకపోవడం. కేవలం టికెట్ ఇస్తాం, పోటీ చేయండి అని ఒత్తిడి చేయడం తప్ప, ఓడిపోతే రక్షణగా ఉండే రాజకీయ అభయం గానీ, ఆర్థిక చేయూత గానీ దక్కదనే నమ్మకలేమి క్షేత్రస్థాయిలో బలంగా పాతుకుపోయింది. దీంతో ప్రతిష్టాత్మక స్థానిక ఎన్నికల్లో ఖాళీగా మిగిలిపోతే పార్టీ ఉనికికే ప్రమాదమని భావించిన అధిష్ఠానం, ఒత్తిడి తంత్రాలను ప్రయోగిస్తోందిఅధికారంలో ఉన్నప్పుడు చూపిన దూకుడు, ఓడిపోయాక క్యాడర్‌కు అందించాల్సిన భరోసాగా మారలేకపోవడమే వైఎస్ఆర్‌సీపీ ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. హెచ్చరికలు, ఒత్తిళ్లతో నామినేషన్లు వేయించగలరేమో గానీ, గ్రామాల్లో కార్యకర్తల్లో కసిని, ఆత్మవిశ్వాసాన్ని నింపలేరనేది స్పష్టమవుతోంది. ఈ ఫోర్స్డ్ పోటీ వ్యూహం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు మేలు చేస్తుందో లేక క్యాడర్‌ను పార్టీకి మరింత దూరం చేస్తుందో వేచి చూడాలి.

## తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు

**కడప, సెప్టెంబర్ 18, పెన్ పవర్:** కుటుంబం విషయంలో జగన్ తప్పుల్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా ఊహించని నష్టాన్ని మిగిల్చాయి. ఎన్నికల వేళ చెల్లి షర్మిల, తల్లి విజయమ్మ రోడ్డెక్కి బహిరంగ లేఖలు రాయడం, పంపకాలపై కోర్టు మెట్లెక్కడం వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ విశ్వసనీయతను దారుణంగా దెబ్బతీశాయి. ఇంట్లోనే న్యాయం చేయలేని నాయకుడు రాష్ట్రానికి ఏం చేస్తాడన్న విపక్షాల ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందన్నది కాదనలేని సత్యం. ఈ క్రమంలో ఈ నష్టాన్ని ఇలాగే కొనసాగనిస్తే భవిష్యత్తు మరింత అగమ్యగోచరంగా మారుతుందని గ్రహించిన జగన్.. కుటుంబంతో వివాదాలకు తెరదించి, తల్లి-చెల్లితో సెటిల్మెంట్ దిశగా పావులు కదుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.ఈ పరిణామాల వెనుక ఉన్న ముఖ్య కారణం.. చుట్టూ ఉన్న సొంత కోటరీ పై జగన్‌కు నమ్మకం సన్నగిల్లడమేనని తెలుస్తోంది. వైఎస్ వివేకా హత్య కేసు నుంచి మొదలుకొని, షర్మిలకు వాటాల నిరాకరణ, ఎన్‌సీఎల్‌టీ వరకు వివాదాన్ని తీసుకెళ్లడంలో జగన్ పక్కనున్న కొందరు కీలక నేతలు, సలహాదారులే తప్పుడు మార్గదర్శనం చేశారన్న భావన ఇప్పుడు ఆయనలో బలపడినట్లు చెబుతున్నారు. కుటుంబంలో సయోధ్య కుదిర్చే బదులు చిచ్చు రాజేసి, తమ సొంత ప్రయోజనాలను కాపాడుకున్నారని ఆయన గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. తల్లి, చెల్లిని దూరం చేసుకుని పార్టీ పరంగానే కాకుండా నైతికంగా తీవ్ర ఏకాకిగా మారిన పరిస్థితుల్లో.. తన కోటరీ మాటలను పక్కనపెట్టి నేరుగా రాజీకి సిద్ధపడటమే మేలనే ఆలోచనకు జగన్ వచ్చినట్లు భావిస్తున్నారు.జగన్ ఆలోచనా విధానంలో వస్తున్న ఈ మార్పుకు జాతీయ రాజకీయ సమీకరణాలు కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. కేంద్రంలో బీజేపీతో ఉన్న సమీకరణాలు, రాష్ట్రంలో కూటమి పటిష్టత దృష్ట్యా.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పుంజుకుంటుందనే గట్టి నమ్మకం వైఎస్సార్సీపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. బీజేపీ అండ లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి రక్షణ కష్టమని ఇన్నాళ్లూ భావించినప్పటికీ.. రేపటి రోజున కేంద్రంలో కాంగ్రెస్ కీలకంగా మారితే తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆ పార్టీతో సఖ్యత తప్పనిసరి అని జగన్ అంచనా వేస్తున్నట్లు వినికిడి. అయితే, కాంగ్రెస్‌తో తెరవెనుక చర్చలు జరగాలన్నా, పార్టీ పెద్దల మద్దతు లభించాలన్నా.. ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న చెల్లెలు వైఎస్ షర్మిలతో ఉన్న వైరాన్ని పూర్తిగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఇరువర్గాల మధ్య రాయబారానికి చొరవ చూపుతున్నారన్న గుసగుసలు బలపడుతున్నాయి.ఒకవేళ ఈ సెటిల్మెంట్ నిజంగానే పట్టాలెక్కితే.. గతంలో కుదిరిన ఎంవోయూ ప్రకారం సరస్వతి పవర్, భారతి సిమెంట్స్, సాక్షి , బెంగుళూరు ఎలహంక ప్యాలెస్ వంటి ఆస్తుల వాటాలను షర్మిల, విజయమ్మ పేర్లపైకి బదలాయించేందుకు జగన్ సిద్ధపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాజకీయాల్లో అక్రమ సంపాదనగా ప్రత్యర్థులు ముద్రవేసిన ఆస్తుల్లో సైతం తన హక్కు కోసం పోరాడుతున్న షర్మిలకు ఆమె వాటా దక్కితే వివాదం సమసిపోవచ్చు. అయితే, జగన్ ఉచితంగా ఈ పంపకాలకు ఒప్పుకుంటారా అంటే కాదనే చెప్పాలి. ఆస్తుల సర్దుబాటుతో పాటుగా.. భవిష్యత్తులో జగన్‌ను రాజకీయంగా టార్గెట్ చేయకుండా ఉండాలని, రాజకీయంగా సహకరించాలని షరతు పెట్టే అవకాశం ఉంది. అయితే, గత ఐదేళ్లలో వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్ర అవమానాలను ఎదుర్కొన్న షర్మిల.. కేవలం ఆస్తుల సర్దుబాటుతో జగన్ పెట్టే రాజకీయ షరతులకు ఏమేరకు తలొగ్గుతారు, కాంగ్రెస్ అధిష్ఠానం జగన్‌ను ఎంతవరకు విశ్వసిస్తుందనేది మాత్రం ఎవరూ చెప్పలేరు.

## 25 నుంచి కొత్త జిల్లా జెడ్పీ కార్యక్రమాలు

**నెల్లూరు సెప్టెంబర్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పరిపాలన వికేంద్రీకరణ దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 15 జిల్లాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా పరిషత్ (జడ్పీ) కార్యాలయాల తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 24వ తేదీతో ముగియనుండడంతో, మరుసటి రోజే కొత్త జిల్లాల పరిధిలో నూతన జడ్పీ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చేందుకు పంచాయతీరాజ్ శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది.కొత్త జిల్లాల జడ్పీల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇటీవలనే పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా 15 జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జజుూ), అలాగే మరో 15 డిప్యూటీ సీఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు త్వరలోనే పదోన్నతులు కల్పించనున్నారు. జడ్పీల విభజన ప్రక్రియ సజావుగా సాగేలా చూడడానికి వీలుగా పాత ఉమ్మడి జిల్లాల కార్యాలయాల నుంచి సిబ్బందిని హేతుబద్ధీకరించి కొత్త జిల్లాలకు కేటాయిస్తున్నారు.ప్రస్తుతానికి శాశ్వత భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు, అన్ని జిల్లాల్లోనూ అనువైన ప్రభుత్వ లేదా ప్రైవేట్ తాత్కాలిక భవనాల్లోనే ఈ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన నిధుల మంజూరు, ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, స్థానిక సంస్థల అభివృద్ధి పనుల ప్రక్రియ కొత్త జిల్లాల పరిధిలోనే చాలా వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ నూతన జడ్పీల ఏర్పాటుతో జిల్లాల వారీగా స్థానిక పాలనకు పూర్తి స్థాయి అధికారాలు బదిలీ కానున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వెంటాడిన ప్రమాదం.. ఆస్ట్రేలియాలో విశాఖకు చెందిన అత్తాకోడళ్లు దుర్మరణం



ఆస్ట్రేలియాలో జరిగిన ఒక విషాద రోడ్డు ప్రమాదం తెలుగు రాష్ట్రాన్ని, ముఖ్యంగా విశాఖపట్నాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మెల్‌బోర్న్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అత్తాకోడళు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మెల్‌బోర్న్‌లోని పామర్స్ రోడ్‌పై ఈ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విశాఖపట్నం జిల్లాకు చెందిన వీఎన్‌సీ (వీడీసీ) మాజీ జాయింట్ సెక్రటరీ జీటీ ప్రసాద్, ఆయన భార్య ఇటీవల ఓ కుటుంబ శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. అక్కడ కుటుంబ సభ్యులతో కలిసి టయోటా కారులో ప్రయాణిస్తుండగా.. వేగంగా వచ్చిన పోర్షే వాహనం వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి కారు తీవ్రంగా ధ్వంసమై.. జీటీ ప్రసాద్ భార్యతో పాటు ఆయన కోడలు నేహా అక్కడికక్కడే మృతి చెందారు. కళ్లముందే భార్య, కోడలు అనంత లోకాలకు వెళ్లడంతో ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**పరిస్థితి తీవ్రం.. విచారణ వేగవంతం**

కారు నడుపుతున్న డ్రైవర్ తీవ్ర గాయపడటంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. విక్టోరియా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాద తీవ్రత, వాహనాల వేగం, సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విచారణ నిమిత్తం పామర్స్ రోడ్డును అధికారులు కొంతసేపు మూసివేశారు. పోర్షే వాహన డ్రైవర్ విచారణకు సహకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**కమ్యూనిటీ నివాళులు.. సహాయక చర్యలు**

ఈ హృదయ విదారక సంఘటనతో ఆస్ట్రేలియాలోని తెలుగు సమాజంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మెల్‌బోర్న్ తెలుగు ఎన్నారై సంఘాలు, స్థానిక కమ్యూనిటీ నాయకులు బాధితుడికి అండగా నిలిచారు. పార్థివ దేహాలను వీలైనంత త్వరగా విశాఖపట్నం తరలించేందుకు అవసరమైన రాయబార కార్యాలయ ప్రక్రియలను, చట్టపరమైన సహాయాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

# 2026లో హెచ్1బీ స్లాట్లు ఖాళీ లేవు.. భారత్‌లోనే చిక్కుకుపోయిన వీసా హోల్డర్లు




అమెరికాలో స్థిరపడి ప్రముఖ టెక్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ హెచ్1బీ వీసా హోల్డర్లకు వీసా అపాయింట్‌మెంట్ కొరత మరోసారి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సొంత ఊళ్లకు, కుటుంబ కార్యక్రమాలకు లేదా సెలవులపై భారత్‌కు వచ్చిన వేలాది మంది టెక్ నిపుణులు తిరిగి అమెరికా వెళ్లేందుకు అవసరమైన వీసా స్టాంపింగ్ స్లాట్లు దొరక్క ఇక్కడే చిక్కుకుపోయారు. 2026లో మిగిలిన కాలానికి హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాలోని అమెరికన్ కాన్సులేట్లలో సాధారణ ఇంటర్వ్యూ స్లాట్లు దాదాపుగా అందుబాటులో లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. పోర్టల్‌ను తెరవగానే దరఖాస్తుదారులకు నిరంతరం "నో స్లాట్స్ అవైలబుల్" అనే సందేశమే దర్శనమిస్తుండటంతో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. రెడిట్ వంటి సోషల్ మీడియా వేదికల్లో కాన్సులేట్ స్క్రీన్‌షాట్లు వైరల్ కావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సంక్షోభం వెనుక ప్రధానంగా గత ఏడాది చివర్లో జరిగిన పరిణామాలు ఉన్నాయి. డిసెంబర్ 2025లో అనేక వీసా ఇంటర్వ్యూలు అకస్మాత్తుగా రద్దుకావడం.. ఆ తర్వాత ఆ అపాయింట్‌మెంట్లను 2026లోకి రీషెడ్యూల్ చేయడంతో కొత్త స్లాట్లకు తీవ్ర కొరత ఏర్పడింది. దానికి తోడు, అమెరికా విదేశాంగ శాఖ చేపట్టిన సోషల్ మీడియా స్క్రీనింగ్ ప్రక్రియ వల్ల ఒక్కో దరఖాస్తు పరిశీలనకు ఎక్కువ సమయం పడుతుండటం వ్యవస్థపై ఒత్తిడిని పెంచింది. గతంలో భారత్‌లో స్లాట్లు దొరకనప్పుడు కెనడా, మెక్సికో లేదా ఇతర మూడో దేశాలకు వెళ్లి వీసా స్టాంపింగ్ చేసుకునే సదుపాయం ఉండేది. కానీ కొత్త ఆంక్షల వల్ల ఆ థర్డ్-కంట్రీ స్టాంపింగ్ మార్గాలు కూడా మూతపడ్డాయి. దీనికి తోడు హెచ్1బీ తో పాటు ఓ, ఎల్ వంటి ఇతర ప్రాధాన్య నాన్-ఇమిగ్రెంట్ వీసాలకు కూడా అపాయింట్‌మెంట్లు లభించకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

ఈ అనిశ్చితి వల్ల భారతదేశంలో ఆగిపోయిన ఉద్యోగులు అమెరికాలోని తమ ప్రాజెక్టులు, ఉద్యోగాలు ఎక్కడ ప్రమాదంలో పడతాయోనని తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో అపాయింట్‌మెంట్ క్యాలెండర్లు 2027 వరకు వెళ్లిపోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు ప్రస్తుతం అమెరికాలోనే ఉన్న హెచ్1బీ హోల్డర్లు కూడా స్వదేశానికి వస్తే తిరిగి ఎప్పుడు వెళ్తామో తెలియని పరిస్థితి ఉండటంతో తమ ప్రయాణ ప్రణాళికలను వాయిదా వేసుకుంటున్నారు. కాన్సులేట్ల నుంచి కొత్త స్లాట్ల విడుదలపై అధికారిక ప్రకటన వచ్చే వరకు భారత్‌కు రాకపోవడమే శ్రేయస్కరమని ఇమ్మిగ్రేషన్ నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు ఉన్నవారు తగిన ఆధారాలతో ఎమర్జెన్సీ అపాయింట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవడం మినహా వేరే ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.

# ముసుగు లేని జీవితం: స్వచ్ఛమైన ఆత్మవిశ్వాసానికి ప్రతీక!



మానవ జీవితానికి నిజమైన ఆనందం, అందం, ఆత్మసంతృప్తి తెచ్చేది సంపద .. హోదా కాదు వ్యక్తిత్వం. వ్యక్తిత్వంతో జీవించడం అంటే ?సమాజంలో నలుగురి దృష్టిని ఆకర్షించడం మాత్రమే కాదు. ఎవరూ గ్రహించనప్పుడు కూడా విలువలతో నడుచుకోవడం. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం. ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి పరిస్థితిలోనూ ఆలోచనలు, ప్రవర్తన పట్ల నిలకడగా ఉండడమే నిజమైన వ్యక్తిత్వానికి పునాది. స్వీయ పరిశీలన అనేది వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి మొదటి మెట్టు. బలాలు, బలహీనతలను స్పష్టంగా ఒప్పుకుంటూ.. ఇతరులను అనుకరించకుండా మనలా మనం ఉండటమే అసలైన నిజాయితీ. సమాజం కోసం లేదా ఇతరుల మెప్పు కోసం ముసుగు వేసుకోకుండా ఉన్నప్పుడే? మనపై మనకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆలోచనలకు, మాటలకు, చేసే పనులకు మధ్య పొంతన ఉన్నప్పుడే ప్రవర్తనకు నమ్మకం, బలం చేకూరుతాయి. ఎంచుకునే నైతిక విలువలే జీవిత ప్రయాణానికి దిక్సూచిగా పని చేస్తాయి. నిజాయితీ, దయ, ధర్మం వంటి సూత్రాలకు కట్టుబడి ఉన్నప్పుడు అనేక సవాళ్లు ఎదురవ్వొచ్చు. అయితే స్వల్పకాలిక ప్రయోజనాల కోసం లేదా సౌకర్యం కోసం మన సూత్రాలను విడిచిపెట్టకుండా.. కష్టసమయాల్లో కూడా నీతిగా నిలబడటమే వ్యక్తి నైతిక దృఢత్వాన్ని చాటుతుంది. విలువల ఆధారంగా తీసుకునే నిర్ణయాలే ఎవరినైనా? ఉన్నత స్థానంలో నిలబెడతాయి.

తప్పు చేసినప్పుడు దాచకుండా అంగీకరించి పూర్తి బాధ్యత వహించే ధైర్యం ఉండడం గొప్ప వ్యక్తిత్వానికి ప్రతీక. ఓటములు ఐ

లేదా విమర్శలు ఎదురైనప్పుడు ఇతరులను నిందించకుండా? స్వయంగా పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలి. ఇతరుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా సరియైన దాని కోసం గొంతు విప్పే మానసిక స్థైర్యమే మనిషిని సమాజంలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. మన వ్యక్తిత్వం ఇతరులతో మనం ఎలా వ్యవహరిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. అందరి పట్ల గౌరవం కలిగి ఉండడం, సానుభూతితో స్పందించడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం వంటి లక్షణాలు మనిషి విలువను పెంచుతాయి. స్వార్థాన్ని వీడి సమాజ శ్రేయస్సును కాంక్షించే గుణం, చుట్టూ ఉన్నవారికి అండగా నిలిచే నైజం వ్యక్తిత్వానికి నిజమైన శోభను తీసుకొస్తాయి. వ్యక్తిత్వంతో బ్రతకడం అనేది ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదు. అది జీవితాంతం సాగే నిరంతర సాధన. రోజూ ప్రవర్తనను సరిదిద్దుకుంటూ పరిణతి చెందుతూ జీవించినప్పుడు జీవితానికి స్పష్టమైన అర్థం, పరిపూర్ణత లభిస్తాయి. అలాంటి ఆత్మగౌరవంతో కూడిన ప్రయాణం మనశ్శాంతిని ఇవ్వడమే కాదు. నలుగురికీ మార్గదర్శకంగా నిలుస్తుంది.

అంతిమంగా ఎంత సంపాదించాం? ఎంతమంది మెప్పు పొందామనే? దానికంటే స్వచ్ఛమైన మనస్సాక్షితో ఎంత ప్రశాంతంగా జీవించామన్నదే ప్రధానం. నకిలీ ముసుగులతో లభించే తాత్కాలిక ప్రజాదరణ కంటే? నిజాయితీతో నిండిన ఆత్మవిశ్వాసమే జీవితానికి శాశ్వతమైన వెలుగునిస్తుంది. విలువలతో కూడిన వ్యక్తిత్వమే ఇతరులకు అందించే అతిపెద్ద స్ఫూర్తి. కాబట్టి ప్రలోభాలకు లొంగకు. ఆత్మగౌరవాన్ని వీడకు. నిఖార్సైన మనుషులుగా జీవిద్దాం. జీవితాన్ని సమాజానికి ఉన్నతమైన నిదర్శనంగా మలుచుకుందాం.

# ఏఐ దూకుడుకు బ్రేకులు? కేంద్రం కీలక నిర్ణయం.. కొత్త రూల్స్‌కు రంగం సిద్ధం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని వేగంగా మార్చేస్తోంది. విద్య, వైద్యం, పరిశోధన, వ్యాపారం, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాల్లో ఏఐ కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. అయితే ఇదే టెక్నాలజీ తప్పుడు చేతుల్లోకి వెళ్తే ఫేక్ కంటెంట్, డీప్‌ఫేక్‌లు, మోసాలు, వ్యక్తిగత డేటా దుర్వినియోగం వంటి సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఏఐపై నియంత్రణ అవసరంపై చర్చ మరోసారి ఊపందుకుంది. కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజా వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఏఐ అభివృద్ధిని అడ్డుకోవడం ప్రభుత్వ ఉద్దేశం కాదని.. అయితే యూజర్ల భద్రతకు కొన్ని నిబంధనలు అవసరమని ఆయన స్పష్టం చేశారు. కొత్త టెక్నాలజీతో వచ్చే ప్రయోజనాలతో పాటు కొత్త రకాల సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయని.. వాటిని ఎదుర్కొనేందుకు రెగ్యులేషన్‌కు కూడా ఒక పాత్ర ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**ఏఐని ఆపడం కాదు.. సేఫ్‌గా వాడేలా చేయడమే**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏఐపై రెండు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఒకవైపు టెక్నాలజీ అభివృద్ధిపై అధిక నియంత్రణ పెడితే ఇన్నోవేషన్ దెబ్బతింటుందనే ఆందోళన ఉంది. మరోవైపు ఎలాంటి నియంత్రణ లేకుండా ఏఐను వదిలేస్తే దాని దుర్వినియోగం పెరిగే ప్రమాదం ఉందనే వాదన ఉంది. భారత్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరి ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించే దిశగా కనిపిస్తోంది. అంటే ఏఐ టెక్నాలజీ అభివృద్ధిని ఆపకుండా దాని వల్ల ప్రజలకు కలిగే నష్టాలను తగ్గించేందుకు అవసరమైన నిబంధనలు తీసుకురావడంపై దృష్టి పెట్టనుంది.

**డీప్‌ఫేక్‌లే పెద్ద సవాలు**

ఏఐతో ఎదురవుతున్న ప్రధాన సమస్యల్లో డీప్‌ఫేక్ కంటెంట్ ఒకటి. ఒక వ్యక్తి మాట్లాడని మాటలను అతని గొంతుతోనే మాట్లాడించినట్లు ఆడియో రూపొందించడం.. అసలు జరగని ఘటనను జరిగినట్లు చూపించే వీడియోలు తయారు చేయడం ఇప్పుడు సాంకేతికంగా సాధ్యమవుతోంది. ముఖ్యంగా ప్రముఖులు, రాజకీయ నాయకులు, సినీ నటులు, వ్యాపారవేత్తల పేర్లను ఉపయోగించి ఫేక్ వీడియోలు, వాయిస్‌లు సృష్టించి మోసాలకు పాల్పడే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఇలాంటి కంటెంట్ వేగంగా వైరల్ కావడం సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తోంది.

**ఫిబ్రవరి మార్పులు ఎందుకు కీలకం?**

ఏఐ ద్వారా తయారైన కంటెంట్‌ను వినియోగదారులు సులభంగా గుర్తించేలా చేయడం కూడా కేంద్రం తీసుకున్న చర్యల్లో ఒకటి. ఫిబ్రవరిలో ఐటీ రూల్స్‌లో మార్పులు చేసి, ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు సంబంధించిన లేబులింగ్, అలాగే మెటాడేటాలో సంబంధిత సమాచారం ఉండేలా నిబంధనలు తీసుకొచ్చింది. ఇది అమల్లోకి వస్తే ఒక ఫొటో, వీడియో లేదా ఇతర కంటెంట్ నిజమైనదా? ఏఐ ద్వారా రూపొందించబడిందా? అనే విషయాన్ని గుర్తించడానికి వినియోగదారులకు కొంత అదనపు సమాచారం లభించే అవకాశం ఉంటుంది. అంతేకాదు చట్టవిరుద్ధమైన ఏఐ కంటెంట్ విషయంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల బాధ్యత కూడా కీలకం కానుంది.

**భారత్‌లో ప్రత్యేక ఏఐ చట్టం ఉందా?**

ప్రస్తుతం భారత్‌లో ఏఐను మాత్రమే లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ప్రత్యేక సమగ్ర చట్టం లేదు. అయితే ఏఐతో సంబంధం ఉన్న వివిధ అంశాలకు ఇప్పటికే ఉన్న ఐటీ చట్టాలు, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, ఇతర నిబంధనలు వర్తిస్తున్నాయి. అయితే ఏఐ సామర్థ్యాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిబంధనలు సరిపోతాయా? లేక ప్రత్యేకంగా మరిన్ని నియమాలు అవసరమా? అనే ప్రశ్నపై చర్చ జరుగుతోంది.

**టెక్ కంపెనీలతో చర్చలు.. నెక్స్ట్ ఏంటి?**

ఏఐ రంగంలో పనిచేస్తున్న టెక్ కంపెనీలతో ప్రభుత్వం మరిన్ని నియంత్రణ చర్యలపై చర్చిస్తున్నట్లు మంత్రి వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా మూడు అంశాలు కీలకం కానున్నాయి. యూజర్ సేఫ్టీ, ఏఐ కంటెంట్ గుర్తింపు, టెక్నాలజీ ఇన్నోవేషన్‌కు స్వేచ్ఛ.. ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా మారనుంది. ఎక్కువ నియంత్రణలు తీసుకొస్తే ఏఐ స్టార్టప్‌లు, పరిశోధనలు, కొత్త ఉత్పత్తుల అభివృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. అదే సమయంలో నియంత్రణలు తక్కువగా ఉంటే డీప్‌ఫేక్‌లు, మోసాలు, డేటా దుర్వినియోగం వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది.

**రాబోయే రోజుల్లో ఏఐకి 'రూల్‌బుక్'?**

అందుకే కేంద్రం ముందున్న అసలు ప్రశ్న ఏఐను నియంత్రించాలా? అనే దానికంటే ఎంతవరకు, ఏ అంశాల్లో నియంత్రించాలి? అన్నదే. ఏఐని పూర్తిగా కట్టడి చేయడం కంటే దాని దుర్వినియోగాన్ని అడ్డుకునే నిబంధనలు తీసుకురావడం.. ప్రజలకు పారదర్శకత కల్పించడం.. ప్లాట్‌ఫామ్‌ల బాధ్యతను స్పష్టం చేయడం వంటి అంశాలపై భవిష్యత్ విధానం ఉండే అవకాశం ఉంది.

మొత్తంగా చూస్తే.. భారత్‌లో ఏఐపై నియంత్రణ చర్చ ఇప్పుడు కొత్త దశలోకి వెళ్తోంది. టెక్నాలజీ వేగానికి బ్రేకులు వేయడం కాకుండా.. అది అదుపు తప్పకుండా చూసే 'సేఫ్టీ బెల్ట్' ఏర్పాటు చేయడమే కేంద్రం ముందున్న లక్ష్యంగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ప్రభుత్వం, టెక్ కంపెనీలు, నిపుణుల చర్చల తర్వాత ఎలాంటి కొత్త నిబంధనలు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# అరెస్ట్ అయిన ఎన్నారై మోసం 336 కోట్లు.. బాధితుల్లో టేలర్ స్విఫ్ట్ భర్త

మెరికాలో ప్రపంచ ప్రఖ్యాత పాప్ సెన్సేషన్ టేలర్ స్విఫ్ట్ భర్త, ఎన్ఎఫ్ఎల్ స్టార్ ట్రావిస్ కెల్స్‌ను ఒక భారతీయ సంతతి వ్యక్తి భారీ ఆర్థిక మోసానికి గురిచేయడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. టెక్సాస్ కేంద్రంగా ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ నడిపిన సిద్ధార్థ్ జవహర్ అనే 38 ఏళ్ల వ్యక్తి పాంజీ స్కీమ్ ద్వారా సుమారు 35 మిలియన్ డాలర్ల కుంభకోణానికి పాల్పడ్డాడు. ఈ మోసంలో ట్రావిస్ కెల్స్ కూడా బాధితుడిగా నష్టపోగా.. ఈ కేసుకు సంబంధించి నిందితుడికి అమెరికన్ ఫెడరల్ కోర్టు 11 సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు భారీ జరిమానాను కూడా ఆదేశించింది. ఇలాంటి ఆర్థిక నేరాలు -మోసపూరిత ఘటనలు తాత్కాలికంగా మొత్తం ప్రవాస భారతీయ (ఎన్నారై) సమాజంపై, వారి కష్టార్జితంతో సంపాదించుకున్న ప్రతిష్టపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక వ్యక్తి చేసే తప్పులకు యావత్ జాతిని ముడిపెట్టే ధోరణి స్థానిక మీడియాలో అధికమవ్వడం వల్ల.. దశాబ్దాలుగా ఎన్నారైలు కష్టపడి సంపాదించుకున్న నమ్మకానికి ఒక్కసారిగా తూట్లు పడే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అగ్రగామి సంస్థలను నడిపిస్తూ.. అత్యున్నత ప్రమాణాలతో జీవిస్తున్న కోట్లాది మంది భారతీయుల నిజాయితీని కూడా ఇలాంటి ఘటనలు ప్రశ్నార్థకం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అయితే కొద్దిమంది వ్యక్తులు చేసే ఇలాంటి చట్టవిరుద్ధమైన పనుల ఆధారంగా కోట్లాది మంది ప్రవాస భారతీయుల నిజాయితీని అంచనా వేయలేము. విదేశీయులతో పోలిస్తే అమెరికా, బ్రిటన్, కెనడా వంటి దేశాలలో భారతీయ ఎన్నారైలు అత్యంత జాగ్రత్తగా చట్టబద్ధంగా, పద్ధతిగా జీవిస్తున్నారనడానికి ఎన్నో బలమైన ఆధారాలున్నాయి. అడపా దడపా జరిగే ఇలాంటి చెదురుముదురు మోసపూరిత ఘటనలు మినహాయిస్తే.. ప్రవాస భారతీయుల జీవన విధానం స్థానిక సమాజానికి ఎప్పుడూ సురక్షితమైన వాతావరణాన్నే అందిస్తుంది. స్థానిక చట్టాలను గౌరవిస్తూ ఉన్నత విద్యావంతులుగా, శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా .. అలాగే పారిశ్రామికవేత్తలుగా ఎదిగే లక్షలాది మంది భారతీయుల అచంచలమైన విజయాలు ఇలాంటి అరుదైన మోసపూరిత ఘటనల నీడను సులభంగా అధిగమిస్తాయి. కొద్దిమంది చేసే అసాంఘిక పనుల కంటే మెజారిటీ భారతీయుల నిబద్ధత, నైతిక విలువలు ..దేశాభివృద్ధికి వారు ఇస్తున్న సహకారమే సమాజంలో బలమైన ముద్ర వేస్తుంది. వ్యక్తిగత స్వార్థంతో కూడిన నేరాలు కొందరికే పరిమితమని.. ఎన్నారైల సమష్టి కృషి , క్రమశిక్షణే ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి అసలైన బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తుందని వారి విజయాలు నిరూపిస్తుంటాయి.

సమగ్రంగా పరిశీలిస్తే.. విదేశాలలో భారతీయ ఎన్నారైలు పద్ధతిగా, చట్టప్రకారంగా జీవిస్తూ ఆయా దేశాల ప్రగతికి వెన్నెముకగా నిలుస్తున్నారనేది కాదనలేని సత్యం. వ్యక్తిగత తప్పులను జాతికి ఆపాదించడం సరైన పద్ధతి కాదని.. మెజారిటీ భారతీయుల కష్టించే తత్వమే ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి నిజమైన కీర్తిని తెచ్చిపెడుతోందని చెప్పవచ్చు.

**336 కోట్ల మోసం గనుకనే ఇంతటి ప్రచారం:**

అమెరికాలో జరిగిన సుమారు 35 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ. 336 కోట్లు) భారీ పాంజీ స్కీమ్ కుంభకోణంలో పలువురు అథ్లెట్లు మోసపోయారు. టెక్సాస్ కేంద్రంగా -స్విఫ్టార్క్ క్యాపిటల్- పేరుతో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీని నడిపిన సిద్ధార్థ్ జవహర్ (38) అనే వ్యక్తి ఈ మోసానికి పాల్పడ్డాడు. ఈ కేసుకు సంబంధించి అమెరికన్ ఫెడరల్ కోర్టు నిందితుడికి 11 సంవత్సరాల జైలు శిక్ష విధించడంతో పాటు.. బాధితులకు మొత్తం 31.35 మిలియన్ డాలర్లు రికవరీ కింద చెల్లించాలని ఆదేశించింది. ఇన్వెస్టర్ల నుంచి సేకరించిన కోట్లాది రూపాయలను సరైన వ్యాపారాల్లో పెట్టకుండా.. కేవలం కొద్ది మొత్తాన్ని మాత్రమే పెట్టుబడి పెట్టి మిగతా డబ్బును లగ్జరీ జీవితం కోసం నిందితుడు దుర్వినియోగం చేశాడు. కొత్త ఇన్వెస్టర్ల నుంచి వచ్చే డబ్బుతో పాత వారికి లాభాలు ఇస్తున్నట్లు నమ్మిస్తూ ఈ పాంజీ స్కీమ్‌ను నడిపాడు. 2021 నాటి ఫోర్బ్స్ నివేదిక ప్రకారం ట్రావిస్ కెల్స్‌తో పాటు పలువురు ప్రముఖ అథ్లెట్లు ఈ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టగా.. ఈ కుంభకోణంలో ట్రావిస్ కెల్స్‌కు ఎలాంటి ప్రమేయం లేదని.. ఆయన కేవలం మోసపోయిన ఇన్వెస్టర్లలో ఒకరని అధికారులు స్పష్టం చేశారు.

# అరేబియా అలజడి!

అరేబియా సముద్రపు అంతర్జాతీయ జలాల్లో భారత్, పాకిస్తాన్ నౌకాదళ యుద్ధనౌకల మధ్య జరిగిన ఢీకొట్టుకునే ఘటన, 2025 మేలో పహల్గాం ఉగ్రదాడి అనంతరం నాలుగు రోజులపాటు సాగిన సైనిక ఘర్షణల తర్వాత, రెండు దేశాల మధ్య బహిరంగంగా వెలుగుచూసిన తొలి సైనిక-సంబంధిత ఉదంతం. సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో, ఒమన్‌కు సుమారు 220 కిలోమీటర్ల తూర్పున ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన తీరప్రాంత గస్తీ నౌక 'హునైన్', సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత యుద్ధనౌకను వేగంగా సమీపించింది. కొల్‌కతా శ్రేణి క్షిపణి విధ్వంసక నౌక అని భావిస్తున్న ఈ భారత నౌకను హునైన్ వెంబడించి, పదేపదే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ లెక్కచేయకుండా, అత్యంత అనుచితమైన, అసురక్షితమైన రీతిలో విన్యాసాలు చేస్తూ సమీపించడంతో ఢీకొన్నట్టు భారత్ చెబుతోంది. ఈ ఘర్షణలో పాకిస్తాన్ నౌక తీవ్రంగా దెబ్బతిని రేవుకు తిరిగి వెళ్లగా, భారత నౌక తన నిర్దేశిత విధులను యథావిధిగా కొనసాగించింది. దీనిపై విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్తాన్ హైకమిషన్ డిప్యూటీ హైకమిషనర్ సాద్ వర్రైచ్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. అయితే, ఈ ఘటనపై పాకిస్తాన్ పూర్తి భిన్నమైన కథనాన్ని వినిపిస్తోంది.

తమ నౌక ద్వైవార్షిక సముద్ర విన్యాసం 'సీస్పార్క్-26'లో భాగంగా అంతర్జాతీయ జలాల్లోనే ఉందని, భారత నౌక ప్రమాదకరంగా దిశ మార్చుకుని తమ నౌకను ఢీకొట్టిందని ఇస్లామాబాద్ ఆరోపిస్తోంది. ఇందుకు ప్రతిగా పాకిస్తాన్ కూడా న్యూఢిల్లీలోని తమ రాయబార కార్యాలయం ఉన్నతాధికారిని పిలిపించి నిరసన తెలిపింది. ఇరు దేశాలూ పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి. 1991 నాటి ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ జలాల్లో యుద్ధనౌకలు కనీసం మూడు నాటికల్ మైళ్ల దూరం పాటించాలని, అలాగే సైనిక విన్యాసాల గురించి ముందస్తుగా తెలియజేయాలని నిబంధన ఉంది. ఈ ఒప్పందాన్ని పాకిస్తాన్ ఉల్లంఘించిందని భారత్ చెబుతుండగా, తామే ఆ నిబంధనను పాటించామని, భారత్ ప్రమాదకర చర్యకు పాల్పడిందని పాకిస్తాన్ ప్రతివాదన చేస్తోంది. ఇరు నౌకాదళాల మధ్య ఇలాంటి ప్రత్యక్ష ఘర్షణ చోటుచేసుకోవడం అరుదు. గత ఉదంతం 2011 జూన్‌లో గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో సోమాలియా సముద్రపు దొంగల నుంచి విడిపించిన ఒక వాణిజ్య నౌకకు రక్షణగా వెళ్తుండగా పాకిస్తాన్ యుద్ధనౌక 'బాబర్', భారత యుద్ధనౌక 'గోదావరి'లను తాకిన ఘటన మాత్రమే. అప్పటి నుంచి పదిహేనేళ్ల తర్వాత మళ్లీ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం, పాకిస్తాన్ సైన్యంలోని దుందుడుకుతనాన్ని, ఈ ప్రాంతంలో శాంతి ఎంత పెళుసుగా ఉందో స్పష్టం చేస్తోంది.

భారత్ నుంచి విడిపోయిన నాటి నుంచీ, ఉపఖండంలో ఘర్షణలకు పాకిస్తానే ప్రధాన కారణంగా నిలుస్తూ వచ్చింది. అమెరికా నేతృత్వంలోని ఉగ్రవాద వ్యతిరేక యుద్ధం ముగిశాక వెనుకబడిన పాకిస్తాన్, ఇటీవలి కాలంలో వాషింగ్టన్, బీజింగ్‌లలో తనకు లభించిన కొత్త ప్రాధాన్యత కారణంగా మళ్లీ ధైర్యం కూడగట్టుకున్నట్టు కనిపిస్తోంది. సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీలతో కూడిన నూతనంగా ఏర్పడిన 'మక్కా ఒడంబడిక' పశ్చిమాసియాలో రావల్పిండికి కీలక పాత్రను కట్టబెట్టినట్టు అనిపిస్తుంది. దక్షిణాసియా ఒప్పందం (సియాటో), కేంద్ర ఒప్పంద సంస్థ (సెంటో) వంటి పాశ్చాత్య సైనిక కూటముల్లో పాకిస్తాన్ ఎప్పటినుంచో భాగస్వామిగా ఉన్నప్పటికీ, ఈసారి భారత్ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి పరిస్థితులకు భిన్నంగా, పాకిస్తాన్ ఇప్పుడు ఒకేసారి రెండు ప్రత్యర్థి శక్తికేంద్రాలైన వాషింగ్టన్, బీజింగ్‌లతో సంబంధాలను పెంపొందించుకుంటూ, తాజాగా ఒక కొత్త సైనిక కూటమిని కూడా ఏర్పాటు చేసుకోగలిగింది. అయితే, మరో దృక్కోణం ప్రకారం, అమెరికాకు పాకిస్తాన్‌తో ఉన్న సంబంధాలు ఎప్పుడూ లావాదేవీ స్వభావం కలిగినవే. ఇరాన్‌తో సంభాషణల కోసం వాషింగ్టన్‌కు ఒక సందేశహరుడు అవసరమైన కారణంగానే ఈ కొత్త స్నేహభావం ఏర్పడింది తప్ప, అంతకుమించి లోతైనది కాదు. బీజింగ్‌కు పాకిస్తాన్ ప్రాధాన్యత కూడా ప్రధానంగా భారత్‌కు ప్రతిసమతూకంగా ఉపయోగపడే పాత్రకే పరిమితం. భారత్, చైనాల మధ్య సరిహద్దు వివాదం పరిష్కారమైన రోజు, బీజింగ్‌లో పాకిస్తాన్ ప్రత్యేకతను కోల్పోతుంది. అదేవిధంగా, ఇరాన్‌పట్ల సౌదీ అరేబియా భయంనుంచి పుట్టుకొచ్చిన మూడు దేశాల మక్కా కూటమి కూడా తాత్కాలికమైనదిగానే కనిపిస్తోంది. అరేబియా ద్వీపకల్పంలో యురేనియం శుద్ధిపై నిషేధం లేని పౌర అణు ఒప్పందాన్ని రియాద్ ఇప్పటికే అమెరికాతో కుదుర్చుకుంది. సౌదీ అరేబియా అణుబాంబును అభివృద్ధి చేసుకుంటే, పాకిస్తాన్‌తో సామూహిక భద్రతా ఏర్పాటుకు తనను తాను కట్టుబెట్టుకోవాల్సిన అవసరం దానికి ఇక ఉండదు.

ఈ నేపథ్యంలో, ఇటీవలి కాలంలో అలవాటుగా మారిన ప్రదర్శనాత్మక వైఖరిని విడనాడి, న్యూఢిల్లీ తన అడుగులను జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంది. సముద్ర జలాల్లో నిఘా, గస్తీ కార్యకలాపాలు రెండు అణ్వాయుధ దేశాల నౌకలను వ్యూహాత్మక దూరంలోకి తీసుకురావడం సర్వసాధారణమే అయినప్పటికీ, ఒక్క నావిక తప్పిదం కూడా పెద్ద ఉద్రిక్తతకు దారితీసే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. ప్రస్తుత ఘటనలో ప్రాణనష్టం గానీ, తీవ్ర నిర్మాణాత్మక నష్టంగానీ నమోదు కాకపోవడం ఊరటనిచ్చే అంశమే అయినా, ఇలాంటి ఘటనలు పదేపదే జరిగే అవకాశం ఉన్నందున, ఇరు నౌకాదళాల మధ్య స్పష్టమైన సంభాషణ మార్గాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు మరింత పటిష్ఠం కావాల్సిన అవసరం ఉంది.

భారత్‌కు ఇప్పుడు కావాల్సింది ఆవేశపూరిత ప్రతిస్పందనలు కాదు, దీర్ఘకాలిక వ్యూహాత్మక సహనం. పాకిస్తాన్‌కు ప్రస్తుతం లభిస్తున్న అంతర్జాతీయ ప్రాధాన్యత శాశ్వతమైనది కాదని, అది కేవలం తాత్కాలిక భౌగోళిక-రాజకీయ పరిస్థితుల ఫలితమేనని గుర్తించి, భారత్ తన సొంత సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడంపై, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి. సమయం కలిసొచ్చే వరకూ సహనంతో వేచిచూడటమే వివేకవంతమైన మార్గం. సముద్రంలో ఎగసిన ఈ చిన్న అలజడి, ఉపఖండంలో శాంతి ఎంత పెళుసైనదో మరోసారి గుర్తు చేస్తోంది. దీన్ని కాపాడుకోవడంలో సంయమనమే అసలైన బలం అవుతుంది!

## పనికొచ్చే పలుకు



# నమ్మకంతో.. నదినే కదిలించాడు!

**ఒంటరిగా మొదలైన ఒక పోరాటం... ఇప్పుడు ప్రపంచవ్యాప్త గుర్తింపుగా మారింది. లైక్‌ల కోసమని ఎగతాళి చేసినవారే ఇవాళ చప్పట్లు కొడుతున్నారు, ఎందుకంటే బిట్టు వెంబడించింది ట్రెండ్‌ను కాదు, తన నదిని. ఒక్క యువకుడి చెమట, ఒక్క నదికి కొత్త ఊపిరి పోసి, నెదర్లాండ్స్ దాకా వినిపించే స్వరంగా మారింది.**

సోషల్ మీడియాలో వైరల్ కావడం కోసం కొందరు విచిత్ర విన్యాసాలు చేస్తుంటే, మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు మాత్రం తన ఊరి నదిని కాపాడుకోవాలని నిశ్చయించుకున్నాడు. నెలల తరబడి ఒంటరిగా పోరాడి, చెత్తాచెదారంతో నిండిపోయిన నదిని పునరుద్ధరించాడు. ఆ యువకుడి అంకితభావానికి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ సంస్థ 'ది ఓషన్ క్లీనప్' సీఈఓ బొయాన్ స్లాట్ అతడికి నేరుగా తమ సంస్థలో పనిచేసేందుకు ఆఫర్ ఇచ్చారు.

మాతో కలిసి పనిచేయండి: డచ్ సీఈఓ ఆఫర్

మధ్యప్రదేశ్ రాజ్‌గఢ్ జిల్లా బియోరా ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల సురేంద్ర సింగ్ చౌదరి (బిట్టు తబాహిగా ప్రసిద్ధుడు) గత కొన్ని నెలలుగా అజ్నార్ నదిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, నాచును తొలగిస్తూ స్వచ్ఛమైన నదిగా మార్చాడు. నది పాత, కొత్త రూపాలకు సంబంధించిన ఫోటోలను ఒక ఎక్స్ (ట్విటర్) వినియోగదారుడు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ పోస్ట్ 'ది ఓషన్ క్లీనప్' సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ బొయాన్ స్లాట్ దృష్టికి వెళ్లింది. ఆ ఫోటోలను చూసి ఆశ్చర్యపోయిన స్లాట్.. "మా సంస్థలో పనిచేయడానికి వచ్చేయండి" అంటూ ఆ పోస్ట్ కింద కామెంట్ చేశారు. ఈ ఊహించని ఆహ్వానంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిట్టు తబాహి ఈ ఏడాది జనవరి నుంచి అజ్నార్ నదిని శుభ్రం చేసే పనిని ప్రారంభించాడు. ప్రతిరోజు నదిలో దిగి ప్లాస్టిక్ సీసాలు, వ్యర్థాలను తొలగిస్తూ ఆ దృశ్యాలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసేవాడు. కేవలం లైక్‌లు, వ్యూస్ కోసమే ఇదంతా చేస్తున్నాడని ప్రారంభంలో కొందరు విమర్శించినప్పటికీ అతడు వెనకడుగు వేయలేదు. ఈ శ్రమకోసం అతడు తన సొంత డబ్బు రూ.30,000 వరకు వెచ్చించినట్లు సమాచారం.

ఆనంద్ మహీంద్రా ప్రశంసలు

బిట్టు చేస్తున్న కృషిని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా సైతం గమనించి గత మార్చిలో అభినందించారు. "సామాజిక మాధ్యమాల్లో లైక్‌ల కోసం ప్రయత్నిస్తున్నా, దానివల్ల సమాజానికి మేలు జరుగుతున్నప్పుడు దాన్ని స్వాగతించాల్సిందే. బిట్టు తబాహి కృషి నాకు.. మండే మోటివేషన్" అని ఆనంద్ మహీంద్రా అప్పట్లో ఎక్స్‌లో కొనియాడారు.

ఎవరీ బొయాన్ స్లాట్?

నెదర్లాండ్స్‌కు చెందిన బొయాన్ స్లాట్ పర్యావరణవేత్త, పరిశోధకుడు. సముద్రాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే లక్ష్యంతో 'ది ఓషన్ క్లీనప్' అనే ఎన్జీఓను స్థాపించారు. 2040నాటికి సముద్రాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది.


# సుంకం కత్తి.. సంకోచాల గుత్తి!!



రష్యా నుంచి ముడిచమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై వంద శాతం వరకూ సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కట్టబెడుతూ, అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలూ ఒక బిల్లును ఆమోదించాయి. సెనేటర్ లిండ్సే గ్రాహం రూపొందించిన 'రష్యా, ఇరాన్‌లపై ఆంక్షల చట్టం -2026' పేరుతో ఉన్న బిల్లుకు ప్రతినిధుల సభలో ఆమోదం లభించింది. ప్రస్తుతం రష్యా చమురుకు రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న భారత్, ఈ పరిణామంతో ఆందోళన చెందాలా? అవసరం లేదనడానికి మూడు కారణాలున్నాయి. మొదటిది.. బిల్లుపై ఇంకా ట్రంప్ సంతకం చేయలేదు. రెండోది.. సంతకం చేసినంత మాత్రాన భారత్‌పై ఆటోమేటిక్‌గా సుంకం పడదు. దాన్ని విధించాలా వద్దా అనేది పూర్తిగా అధ్యక్షుడి విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుంది. మూడోది.. వంద శాతం అనేది గరిష్ఠ పరిమితి మాత్రమే తప్ప, డిఫాల్ట్‌గా విధించే సుంకం కాదు. పదిహేడు నెలలుగా సాగుతున్న బిల్లు ప్రయాణం ఇప్పుడు తుది దశకు చేరింది. దీనిపై సంతకం చేయడానికి లేదా వీటో చేయడానికి ట్రంప్‌కు పది రోజుల గడువుంది. ఆయన వీటో చేస్తే కథ అక్కడితో ముగుస్తుంది. సంతకం చేస్తే? అది పెద్ద 'ఇఫ్'యే. ఎందుకంటే రష్యా చమురుపై ఆధారపడిన దేశాలు మరెక్కడి నుంచి కొనుగోలు చేయాలని అమెరికా డిమాండ్ చేయగలదేమోగానీ, ప్రత్యామ్నాయాలు ఏవి? పశ్చిమాసియా నుంచి సరఫరాలు ఇప్పటికే కుంటుపడ్డాయి. రష్యా ఇంధనం లేకుండా ప్రపంచ ధరలు మరింత పైకి ఎగబాకుతాయి.. అది అమెరికా వినియోగదారులనూ వదిలిపెట్టదు. మధ్యంతర ఎన్నికలకు రెండు నెలలు కూడా మిగలని తరుణంలో ట్రంప్ అలాంటి పరిస్థితిని కోరుకోకపోవచ్చు. ఇప్పటికే రిపబ్లికన్ పార్టీకి ఓటు వేసే రైతన్నలు గత ఏడాదిలో డీజిల్ ధరలు దాదాపు 70 శాతం పెరగడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మొక్కజొన్న, సోయాబీన్ పంటల కోత సీజన్ నడుస్తున్న తరుణంలో, గ్యాలన్‌కు 6.2 డాలర్లు చెల్లించి ట్రాక్టర్లు, హార్వెస్టర్లలో ఇంధనం నింపుకోవడం భారంగా మారింది. డీజిల్ ధర 8 డాలర్లకు చేరాలని రిపబ్లికన్లు, ట్రంప్ కోరుకుంటారా? అందుకే భారత్‌పై సుంకం ఒత్తిడిని ట్రంప్ వాయిదా వేసుకునే అవకాశముంది. మూడేళ్ల తర్వాత తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచాల్సి వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వ్‌ను చూస్తుంటే, ద్రవ్యోల్బణంపై ఆయనకు ఆందోళన ఉంది. ఇంధన ధరలు మరింత పెరిగితే ద్రవ్యోల్బణం ఇంకా ఎగబాకుతుంది కాబట్టి, ఈ సుంకం త్వరగా అమల్లోకి రాకపోవచ్చు. డీజిల్ పరిస్థితిపై ట్రంప్ ఎంత ఆందోళన చెందుతున్నారంటే, రష్యాలోని డీజిల్ మౌలిక సదుపాయాలపై దాడులు ఆపాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా ఆయన కోరినట్టు తెలుస్తోంది.

అయితే, ఇదంతా ఊహాజనితమే తప్ప ఖరారైన విషయం కాదు కాబట్టి.. వందశాతం సుంకం విధింపునకు భారత్ సిద్ధంగానే ఉండాలి. ఎందుకంటే, అమెరికాయే భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. అలాగని ఒత్తిడికి తలొగ్గాలా? యస్ చెప్పలేం. 140 కోట్లమంది భారతీయుల ఇంధన భద్రతే తమ ప్రాధాన్యత అని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ ఏడాది జులైలో భారత చమురు కొనుగోళ్లలో రష్యా వాటా 51 శాతానికి చేరిందనే గణాంకాలు ఉండగా, గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఇది సుమారు 30 శాతంగా నమోదైంది. ఈ నేపథ్యంలో, రష్యా ముడిచమురు కొనుగోళ్లను భారత్ ఆపబోదు. మనం మన సొంత ద్రవ్యోల్బణం గురించి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. చౌక రష్యా చమురును వదులుకుంటే, పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి, దేశీయంగా ధరల భారం మరింత తీవ్రమవుతుంది. గత ఏడాది సుంకాల యుద్ధంలో భారత ఔషధ రంగాన్ని, మరికొన్ని ఇతర వస్తువులను ట్రంప్ మినహాయింపు జాబితాలో ఉంచిన సంగతి తెలిసిందే. ఈసారీ అలాంటి మినహాయింపు లభించే అవకాశం లేకపోలేదు. ఎగుమతుల విషయంలో, గత కొన్నేళ్లుగా భారత్ తన మార్కెట్లను వైవిధ్యపరచుకోవడం ద్వారా మెరుగైన స్థానంలో నిలిచింది. దీనివల్ల ఏదైనా ఒక్క మార్కెట్‌పై అతిగా ఆధారపడే స్థితి తగ్గింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భారీ సుంకం విధించే బదులు, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)పై సంతకం చేసేలా భారత్‌ను ఒప్పించేందుకు ట్రంప్ ఈ సుంకం అస్త్రాన్ని ఒక ఒత్తిడి సాధనంగా ఉపయోగించుకునే అవకాశమే ఎక్కువ. అయితే ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న తలెత్తుతుంది. ద్రవ్యోల్బణం భారాన్ని భరించి అయినా బీటీఏపై సంతకం చేయడం భారత్‌కు లాభదాయకమేనా? ఐరోపా సమాఖ్య, జపాన్, దక్షిణ కొరియాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత కూడా ట్రంప్ వాటిపై సుంకాలు విధించిన తీరును గమనిస్తే, ఒప్పందం కుదిరినంత మాత్రాన సుంకాల భయం పూర్తిగా తొలగిపోతుందన్న గ్యారంటీ ఏమీ లేదు.

గత ఏడాది కాలంగా అమెరికా-భారత్ వాణిజ్య సంబంధాల్లో ఈ రష్యా చమురు అంశం పదేపదే తెరపైకి వస్తూనే ఉంది. 2025 ఆగస్టులో రష్యా చమురు కొనుగోళ్ల పేరుతో భారత్‌పై అదనంగా 25 శాతం సుంకం విధించి, మొత్తం సుంకాన్ని 50 శాతానికి పెంచిన ట్రంప్, భారత్ చర్యలను అన్యాయమని, అసమంజసమని పేర్కొంటూ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే ఆసక్తికరంగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా అంశానికి సంబంధించిన 25 శాతం సుంకాన్ని అమెరికాయే ఉపసంహరించుకుంది. భారత్ తీసుకున్న చర్యలను, ద్వైపాక్షిక సహకారాన్ని కారణంగా చూపుతూ శ్వేతసౌధం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఏడు నెలల వ్యవధిలోనే మళ్లీ ఇదే అంశం మరో రూపంలో ముందుకు రావడం గమనార్హం. చైనా, రష్యా చమురు ఎగుమతుల్లో దాదాపు సగం వాటాను, భారత్ 37 శాతం వాటాను (సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ గణాంకాల ప్రకారం) కొనుగోలు చేస్తున్నందున, ఈ ఇద్దరు ఆసియా దిగ్గజాలే ఈ బిల్లు ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంది. అయితే వాణిజ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ చట్టబద్ధమైన అధికారాన్ని ట్రంప్ తక్షణమే ప్రయోగించే బదులు, భవిష్యత్తులో అవసరమైనప్పుడు ఒత్తిడి పెంచేందుకు రిజర్వు చేసుకునే అవకాశమే ఎక్కువ. చైనా, భారత్‌లు రెండూ 2022లో ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి రాయితీ ధరలకు లభించే రష్యా చమురుపై గణనీయంగా ఆధారపడ్డాయి. ఇరాన్ యుద్ధం ఇంధన సరఫరాలను మరింత కుదించడంతో ఈ ఆధారపడటం ఇంకా పెరిగింది. మొత్తంగా చూస్తే, ఈ బిల్లు ఒక వాస్తవిక ముప్పు కంటే ఎక్కువగా ఒక దౌత్యపరమైన ఒత్తిడి సాధనంగానే మిగిలిపోయే అవకాశం కనిపిస్తోంది. అమెరికాలో అంతర్గత రాజకీయ, ఆర్థిక పరిమితులు ట్రంప్ చేతులను కట్టిపడేస్తున్నాయి. వాణిజ్యానికి అనిశ్చితి ఎప్పుడూ శత్రువే కాబట్టి భారత్ తన ఇంధన భద్రతా వ్యూహాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు మార్కెట్ వైవిధ్యీకరణను మరింత విస్తృతం చేసుకోవడం, అమెరికాతో సంభాషణలను చురుగ్గా కొనసాగించడం ద్వారా ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండటమే వివేకవంతమైన మార్గం. ■



మీ నైపుణ్యాలు ఎవరూ దోచుకోలేని గొప్ప ఆస్తులు. మీరు ఎంతటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగలిగితే.. అన్ని ఎక్కువ అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. ఏదైనా సాధించగానే నేర్చుకోవడం ఆపేయకూడదు. మారుతున్న కాలానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ, మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకున్నప్పుడే సమాజంలో మీ విలువ ఎప్పటికీ తగ్గకుండా ఉంటుంది. నైపుణ్యం ఒక్కసారి సంపాదిస్తే సరిపోదు, ప్రతిరోజూ మెరుగుపరుచుకుంటేనే అది ఆయుధంగా నిలుస్తుంది. నేర్చుకోవడం మానేసిన క్షణమే, మీ విలువ తరిగిపోవడం మొదలవుతుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

### 429 అడుగుల 'స్లిమ్ జిమ్'



స్లిమ్ అయినా, జిమ్ అయినా... ఇక్కడ మాత్రం అంతా భారీగానే ఉంది! అమెరికాలోని నెబ్రాస్కా రాష్ట్రం ఒమాహాలో 'కొనాగ్రా బ్రాండ్స్' సంస్థ ఏకంగా 429 అడుగుల 5.4 అంగుళాల పొడవైన 'స్లిమ్ జిమ్' మీట్ స్నాక్‌ను తయారుచేసి, గిన్నిస్ రికార్డును తిరగరాసింది. గతంలో ఉన్న రికార్డును ఏకంగా 116 అడుగులు దాటేసింది! భారీ వైర్ రీల్ చుట్టూ చుట్టిన ఈ స్నాక్‌ను, పార్కింగ్ స్థలంలో వరుసగా అమర్చిన టేబుళ్లపై నిటారుగా విప్పి చూపించారు. రుచిలో మాత్రం మామూలు స్లిమ్ జిమ్‌కు ఏమాత్రం తీసిపోలేదని నిర్వాహకులు చెబుతున్నారు. చిన్నప్పుడు తిన్న స్నాక్ ఇంత "పొడుగు"గా మారుతుందని ఎవరు ఊహించారు.

# గర్భిణి మీద 'టార్చ్'

గర్భంలోని పిండం, పుట్టిన శిశువు సరిగా ఎదగటంలో తల్లి ఆరోగ్యమే కీలకం. గర్భధారణ సమయంలో తలెత్తే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లయినా బిడ్డ మీద విపరీత ప్రభావం చూపొచ్చు. టార్చ్ (టీఓఆర్‌సీహెచ్) ఇన్‌ఫెక్షన్లు మరింత ప్రమాదకరం. అందుకే వీటిని ముందుగానే గుర్తించటం చాలా ముఖ్యం. ఇందుకు తేలికైన రక్త పరీక్ష ఎంతగానో తోడ్పడుతుంది. ఇంతకీ దీని ప్రాధాన్యమేంటి? ఎవరికి అవసరం? ఎలా ఉపయోగపడుతుంది?

గర్భంలోని పిండం, పుట్టిన శిశువు సరిగా ఎదగటంలో తల్లి ఆరోగ్యమే కీలకం. గర్భధారణ సమయంలో తలెత్తే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లయినా బిడ్డ మీద విపరీత ప్రభావం చూపొచ్చు. టార్చ్ (టీఓఆర్‌సీహెచ్) ఇన్‌ఫెక్షన్లు మరింత ప్రమాదకరం. అందుకే వీటిని ముందుగానే గుర్తించటం చాలా ముఖ్యం. ఇందుకు తేలికైన రక్త పరీక్ష ఎంతగానో తోడ్పడుతుంది. ఇంతకీ దీని ప్రాధాన్యమేంటి? ఎవరికి అవసరం? ఎలా ఉపయోగపడుతుంది?



గర్భిణులకు సాధారణంగానే రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ల ముప్పు పెరుగుతుంది. అందువల్ల జాగ్రత్త తప్పనిసరి. ముఖ్యంగా టార్చ్ ఇన్‌ఫెక్షన్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. టార్చ్ అంటే? ఇన్‌ఫెక్షన్ల తొలి అక్షరాల సముదాయం. టి (టాక్సోప్లాస్మోసిస్), ఓ (హెచ్‌ఐవీ, సిఫిలిస్, పార్వోవైరస్ వంటి ఇతర ఇన్‌ఫెక్షన్లు), ఆర్ (రుబెల్లా), సీ (సైటోమెగాలో వైరస్), హెచ్ (హెర్పిస్ సింప్లెక్స్ వైరస్).. వీటన్నింటినీ స్ఫురించేలా ఈ పేరు పెట్టారన్నమాట. ఇవి గర్భధారణ సమయంలో, కాన్పు సమయంలో తల్లి నుంచి బిడ్డకు సంక్రమించే ప్రమాదముంది. జబ్బులను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పిండానికి ఉండదు కాబట్టి టార్చ్ ఇన్‌ఫెక్షన్లు గర్భధారణ సమయంలో చిక్కులు కలిగించొచ్చు. పిండం సరిగా ఎదగకపోవచ్చు. అవయవ లోపాలతో పుట్టొచ్చు. ఇన్‌ఫెక్షన్ల రకాలు, ఎదుగుతున్న సమయంలో వాటికి ఎంత సమయం వరకూ గురయ్యారనే దాన్ని బట్టి దుష్పరిణామాలు ఆధారపడి ఉంటాయి. గర్భం ధరించిన తొలిదశలో ఇవి దాడి చేస్తే మరింత ఎక్కువ నష్టం కలగొచ్చు. ఇక్కడే వీటిని గుర్తించే టార్చ్ పరీక్ష ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

### ఇదెలా ఉపయోగపడుతుంది?

ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డప్పుడు వాటిని ఎదుర్కోవటానికి శరీరం కొన్ని యాంటీ బాడీలను సృష్టించుకుంటుంది. వీటిని గుర్తించటమే టార్చ్ పరీక్ష ప్రత్యేకత. గర్భిణికి గానీ పిండానికీ గానీ ఇన్‌ఫెక్షన్ల లక్షణాలుంటే ఈ పరీక్ష చేస్తారు. తల్లికి ఇటీవలే ఇన్‌ఫెక్షన్ సోకిందా? ఇంతకుముందు ఎప్పుడైనా సోకిందా? అసలు జబ్బే లేదా? అనేవి ఇందులో తెలుస్తాయి. కాన్పు తర్వాత తల్లికి లేదా శిశువుకు ఇన్‌ఫెక్షన్ సోకినట్టు అనుమానించినప్పుడూ ఈ పరీక్ష చేస్తారు.

గర్భిణుల్లో అనుమానించేదెలా?

మామూలుగా గర్భిణులకు చేసే అల్ట్రాసౌండ్ స్కాన్‌లో పిండం ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన సూచికలు ఉన్నట్టయితే అనుమానిస్తారు. కొన్నిసార్లు జ్వరం, చర్మం మీద దద్దు వంటి లక్షణాలతోనూ జబ్బులను పోల్చుకోవచ్చు. ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నవారికి గర్భిణులు సన్నిహితంగా ఉన్నప్పుడు లక్షణాలేవీ లేకపోయినా అనుమానించాల్సి ఉంటుంది.

గర్భస్థ శిశువులో అనుమానించేదెలా?

**పిండం ఎదుగుదల సరిగా లేనప్పుడు.**

స్కాన్ పరీక్ష చేసినప్పుడు కొన్నిసార్లు కడుపు భాగంలో ప్రకాశవంతమైన గీతల వంటి ఆకారాలు కనిపించొచ్చు. ఇవి రుబెల్లా ఇన్‌ఫెక్షన్‌కు సంకేతం కావొచ్చు.

గుండెలో లోపాలు.. ముఖ్యంగా పల్మనరీ కవాటం సంకోచించటం, గోడల మధ్య పొరలో రంధ్రం ఉండటం.

పిండం ఉబ్బటం (ఫీటల్ హైడ్రాప్స్). పార్వోవైరస్ ఇన్‌ఫెక్షన్ మూలంగా రక్తహీనత తలెత్తి పిండం శరీరమంతంటా ద్రవాలు పేరుకుపోతాయి. దీంతో పిండం ఉబ్బుతుంది.

### కాన్పు తర్వాత కూడా

పుట్టిన తర్వాత శిశువులో ఇన్‌ఫెక్షన్లకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే తల్లీ, బిడ్డా ఇద్దరికీ పరీక్ష అవసరమవుతుంది. ఆ లక్షణాలు ఇవీ..

తల్లి కడుపులో పిండం క్రమంగా పెరుగుతూ వస్తుంది. ఆయా నెలల్లో ఉండాల్సిన దాని కన్నా చాలా తక్కువ సైజుతో బిడ్డ పుట్టినప్పుడు.

వినికిడి లోపించటం, మానసిక ఎదుగుదల తగ్గటం.

మూర్ఛ.

పుట్టుకతో గుండె లోపాలు.

శుక్లాలు.

కాలేయం, ప్లీహం పెద్దగా ఉండటం.

ప్లేట్‌లెట్ల సంఖ్య తక్కువగా ఉండటం.

కామెర్లు.

### ఎవరికి అవసరం?

గర్భిణులందరికీ టార్చ్ పరీక్ష అవసరం లేదు. కాబట్టి దీన్ని ఎవరికి చేయాలనేది గుర్తించటం చాలా ముఖ్యం. గైనకాలజిస్ట్, పిండానికి చికిత్స చేసే నిపుణులు, మైక్రోబయాలజిస్ట్ కలిసి ఎవరికి పరీక్ష అవసరమో నిర్ణయిస్తారు. ఇప్పుడు ఆయా ఇన్‌ఫెక్షన్లను వేర్వేరుగా గుర్తించే పీసీఆర్ వంటి పరీక్షలూ ఉన్నాయి. మైక్రో బయాలజిస్ట్ సలహా మేరకు వీటిని చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ తొలిదశలో సూక్ష్మక్రిముల కల్చర్ లేదా యాంటీజెన్‌లను గుర్తించే పరీక్షలూ అవసరమవ్వచ్చు.

టార్చ్ ఇన్‌ఫెక్షన్లు ఎలా సోకుతాయి?

**టాక్సోప్లాస్మోసిస్:** ఇది పరాన్నజీవితో తలెత్తుతుంది. సరిగా ఉడికించని మాంసం లేదా పిల్లి మలం ప్రభావానికి గురికావటం వల్ల సోకుతుంది.

**హెచ్ఐవీ, సిఫిలిస్:** లైంగిక సంపర్కం, వైరస్‌తో కూడిన రక్తం వంటి వాటితో సంక్రమిస్తాయి.

**పార్వోవైరస్:** ఇది పెంపుడు జంతువుల నుంచి సంక్రమించే ఇన్‌ఫెక్షన్. ఇది జలుబు మాదిరిగా శ్వాస, దగ్గు, లాలాజలం ద్వారా ఒకరి నుంచి మరొకరికి అంటుకుంటుంది. రక్తం ద్వారానూ వ్యాపించొచ్చు.

రుబెల్లా: ఇప్పుడు చాలామంది రుబెల్లా టీకా వేయించుకుంటున్నారు. అందువల్ల ఇది అరుదనే చెప్పుకోవచ్చు. అయితే చిన్నప్పుడు ఎంఎంఆర్ టీకా వేయించుకోకపోతే తల్లి నుంచి బిడ్డకు సంక్రమించొచ్చు.

సైటోమెగాలో వైరస్: ఇదోరకం హెర్పిస్ వైరస్. ఇది లాలాజలం, ఇతర శరీర స్రావాల ద్వారా వ్యాపిస్తుంది.

హెర్పిస్ సింప్లెక్స్ వైరస్: ఇది ప్రధానంగా ఒకరి చర్మానికి మరొకరి చర్మం నేరుగా తాకటం ద్వారా సంక్రమిస్తుంది.

ఫలితాల అర్థమేంటి?

టార్చ్ పరీక్ష ఫలితాలను పాజిటివ్ లేదా నెగెటివ్‌గా సూచిస్తారు. ఆయా సూక్ష్మక్రిములకు సంబంధించిన ఐజీజీ, ఐజీఎం యాంటీబాడీలు ఉన్నట్టయితే పాజిటివ్‌గా, లేకపోతే నెగెటివ్ ఫలితం కనిపిస్తుంది.

గర్భిణుల్లో ఐజీఎం యాంటీబాడీలు ఉన్నట్టయితే అప్పుడు ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని అర్థం.

ఐజీజీ యాంటీబాడీ ఉండి, ఐజీఎం లేనట్టయితే అప్పుడు ఇన్‌ఫెక్షన్ చురుకుగా లేదన్నమాట.

ఐజీజీ యాంటీబాడీ ఉంటే గతంలో ఏదో ఒక టార్చ్ ఇన్‌ఫెక్షన్ బారినపడి ఉండొచ్చనే దానికి సంకేతం. ఇప్పుడు దాన్ని ఎదుర్కొనే రోగ నిరోధకశక్తిని సంతరించుకున్నారని భావిస్తారు.

ఒకసారి పరీక్ష చేశాక రెండు వారాల తర్వాత మరోసారి పరీక్ష చేసి చూస్తారు. రెండో పరీక్షలో ఐజీజీ యాంటీబాడీ మోతాదులు పెరిగినట్టయితే ఇటీవల ఇన్‌ఫెక్షన్ బారినపడినట్టు భావిస్తారు. ఒకవేళ రెండోసారి పరీక్షలో యాంటీబాడీల మోతాదులు పెరగకపోతే గర్భిణికి గతంలో ఇన్‌ఫెక్షన్ వచ్చి ఉండొచ్చని, ఇప్పుడు దాన్ని ఎదుర్కోవటానికి రోగనిరోధశక్తిని సంతరించుకొని ఉండొచ్చని అనుకోవచ్చు.

# నడుము జాగ్రత్త సుమా

మనల్ని నిటారుగా ఉంచేది, తేలికగా కదలటానికి తోడ్పడేది వెన్నెముకే. అయినా దీన్ని పెద్దగా పట్టించుకోం. ఇష్టమున్నట్టుగా కూర్చుంటాం, లేస్తుంటాం. ఎడాపెడా బరువులు ఎత్తేస్తుంటాం. ఏదైనా నొప్పి పుట్టేంతవరకూ అసలు వెన్నెముక ఉందన్న సంగతే మరచిపోతుంటాం. మొదట్లో నొప్పి కొద్దిగానే ఉండొచ్చు. ఏదో ఒక వైపునకు వంగినప్పుడో, తిరిగినప్పుడో నొప్పిగా అనిపించొచ్చు. క్రమంగా తీవ్రమై, పనులు చేసుకోవటానికీ ఇబ్బంది కలగొచ్చు.

మనల్ని నిటారుగా ఉంచేది, తేలికగా కదలటానికి తోడ్పడేది వెన్నెముకే. అయినా దీన్ని పెద్దగా పట్టించుకోం. ఇష్టమున్నట్టుగా కూర్చుంటాం, లేస్తుంటాం. ఎడాపెడా బరువులు ఎత్తేస్తుంటాం. ఏదైనా నొప్పి పుట్టేంతవరకూ అసలు వెన్నెముక ఉందన్న సంగతే మరచిపోతుంటాం. మొదట్లో నొప్పి కొద్దిగానే ఉండొచ్చు. ఏదో ఒక వైపునకు వంగినప్పుడో, తిరిగినప్పుడో నొప్పిగా అనిపించొచ్చు. క్రమంగా తీవ్రమై, పనులు చేసుకోవటానికీ ఇబ్బంది కలగొచ్చు.



### పెద్ద సమస్యే

నడుం నొప్పి తరచూ చూసేదే. 30-50 ఏళ్ల వయసువారిలో సుమారు 20% మంది ఏదో ఒక సమయంలో నడుం నొప్పిని అనుభవించినవారే. అన్ని వృత్తుల్లోనూ గైర్హాజరీకి ప్రధాన కారణాల్లో ఇదొకటి. ప్రపంచవ్యాప్తంగా నడుం నొప్పి సమస్య బారినపడుతున్నవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది.

జీవనశైలి మారటంతో..

**రకరకాల జీవనశైలి అంశాలు నడుం నొప్పికి దారితీస్తున్నాయి.**

శారీరక శ్రమ తగ్గటం

ఊబకాయం

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, మొబైల్ ఫోన్లు చూస్తూ గంటల కొద్దీ ముందుకు వంగటం

భంగిమకు సరిపడిన కుర్చీలు, టేబుళ్ల వంటివి వాడకపోవటం

ఇలాంటివి పెద్దవారిలోనే కాదు, పిల్లల్లోనూ నడుం నొప్పికి కారణమవుతున్నాయి.

### మహిళలకు మరింత ముప్పు

నడుం నొప్పి ముప్పు మహిళలకు ఎక్కువ. గర్భధారణ సమయంలో శరీరాన్ని నిటారుగా ఉంచుకునే క్రమంలో భంగిమ దెబ్బతింటుంది. హార్మోన్ల మార్పులు.. ముఖ్యంగా రిలాక్సిన్ అనే హార్మోన్ విడుదల కావటం వల్ల కండరాలు, కండర బంధనాలు బలహీన మవుతాయి. కాన్పు తర్వాత తగిన వ్యాయామాలు చేయకపోతే తాత్కాలికంగా మొదలైన నడుం నొప్పి క్రమంగా దీర్ఘకాల సమస్యగానూ మారుతుంది.

పెద్ద పెద్ద బరువులు ఎత్తే కార్మికులకూ నడుం దెబ్బతినే ప్రమాదముంది.

రోజూ వ్యాయామం చేయనివారు సూట్‌కేస్, నీళ్ల బకెట్ వంటి బరువులను హఠాత్తుగా ఎత్తటమూ నడుం నొప్పికి దారితీయొచ్చు. ఇలాంటి సమయాల్లో పడే ఒత్తిడిని తట్టుకోవటానికి శరీరం సిద్ధంగా లేకపోవటం వల్ల తీవ్రమైన నొప్పి పుడుతుంది.

### కారణాలేంటి?

సరైన పద్ధతిలో బరువులు ఎత్తక పోవటం.

భంగిమ దెబ్బతినటం.

వయసుతో పాటు వెన్నెముక, పూసల మధ్య డిస్కులు అరగటం. ఫలితంగా వెన్నుపాము లేదా నాడుల మీద ఒత్తిడి పడుతుంది. చుట్టుపక్కల ఎముకలు, కండరాలు, కండర బంధనాల వంటివి నాడులను ఒత్తిడి గురి చేయటమూ కారణం కావొచ్చు. దీంతో కిందికి కాళ్లలోకీ నొప్పి (సయాటికా) విస్తరిస్తుంది.

మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు కూడా నడుం నొప్పికి దారితీయొచ్చు.

### నివారణ మార్గముంది

బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎత్తు, బరువు నిష్పత్తి (బీఎంఐ) 25, అంతకన్నా తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

క్రమం తప్పకుండా యోగాసనాలు లేదా కండరాలను సాగదీసే వ్యాయామాలు చేయాలి. ఇవి బరువును తగ్గించనప్పటికీ కదలికలు సాఫీగా సాగటానికి, భంగిమ సజావుగా, శరీరం స్థిరంగా ఉండటానికి తోడ్పడతాయి.

కడుపు, వీపు భాగంలోని కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి.

బరువులను సరైన పద్ధతిలో ఎత్తాలి. నడుమును తిన్నగా ఉంచుతూ.. మోకాళ్లను వంచి, చేతులతో వస్తువులను పట్టుకొని పైకి లేపాలి.

ఎత్తు మడమల చెప్పులు ధరించొద్దు. ఇవి భంగిమను దెబ్బతీస్తాయి.

సిగరెట్ల జోలికి వెళ్లొద్దు. పొగ తాగితే వెన్నెముక, కండరాలకు రక్త సరఫరా తగ్గుతుంది, దెబ్బతిన్న భాగాలు కోలుకోవటం నెమ్మదిస్తుంది.

### చికిత్స ఏంటి?

నడుం నొప్పికి తొలిదశలో గృహ వైద్యం సమర్థంగా పనిచేస్తుంది. తగినంత విశ్రాంతి తీసుకోవటం, వేడితో కాపడం లేదా ఐస్ అద్దటం, క్యాప్‌సైసిన్ వంటి వాటితో కూడిన పూత మందులు, నెమ్మదిగా నడుమును సాగదీయటం, నొప్పి మందులు మేలు చేస్తాయి. అయితే జ్వరం, మొద్దుబారటం, సూదులతో పొడుస్తున్నట్టు అనిపించటం, కాళ్లలోకి నొప్పి పాకటం, కాళ్లు బలహీనం కావటం వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. శారీరక లక్షణాలను పరిశీలించి అవసరాన్ని బట్టి రక్త, ఎక్స్‌రే, సీటీ లేదా ఎంఆర్ఐ పరీక్షలు చేయిస్తారు. నాడుల ద్వారా విద్యుత్ సంకేతాలు ఎంత త్వరగా ప్రసరిస్తున్నాయో తెలిపే పరీక్ష కూడా చేయించొచ్చు. కొన్నిసార్లు పరీక్షల్లో ఎలాంటి కారణమూ బయటపడకపోవచ్చు. దీనికి చికిత్స చేయటం కష్టమవుతుంది కూడా. సాధారణంగా నొప్పి తగ్గించే, కండరాలను వదులు చేసే మందులు ఉపయోగపడతాయి. కొందరికి కొద్ది మోతాదులో కుంగుబాటు మందులూ అవసరమవ్వచ్చు. వీటితో ఉపశమనం కలగకపోతే చివరి మార్గంగా శస్త్రచికిత్స చేస్తారు.

# పీఎంఓఎస్ ప్రభావం శరీరమంతటా

## ఇది పీఎంఓఎస్ అవగాహన మాసం



పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీఎంఓఎస్) ఒక్క అండాశయ తిత్తులకే పరిమితం కాదు. శరీరం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. ఒకప్పుడు పీసీఓఎస్‌గా పిలుచుకునే ఇది హార్మోన్లు, జీవక్రియలతో ముడిపడిన సమస్య. రుతుక్రమం, సంతాన సమస్యలతో పాటు మధుమేహం వంటి దీర్ఘకాల జబ్బుల ముప్పు పెరిగేలా చేస్తుంది.

### ఆ తిత్తులు అపరిపక్వ అండాలే

పీఎంఓఎస్ అనగానే చాలామంది తిత్తుల (సిస్ట్స్) గురించే ఆందోళన చెందుతుంటారు. నిజానికిది అండాశయాలు అవసరానికి మించి హార్మోన్లను విడుదల చేయటం వల్ల తలెత్తే సమస్య. ఇందులో మెదడు, అండాశయాల్లో పుట్టుకొచ్చే హార్మోన్ల మధ్య పరస్పర సంబంధం కీలకపాత్ర పోషిస్తుంది. ముందుగా మెదడులోని హైపోథలమస్ నుంచి విడుదలయ్యే గొనడోట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్ పీయూషగ్రంథిని ప్రేరేపిస్తుంది. అప్పుడు ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ పుట్టుకొచ్చి, అండాశయాలను ఉత్తేజితం చేస్తుంది. దీంతో ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు తయారవుతాయి. ఈస్ట్రోజన్ ఒక స్థాయికి చేరుకోగానే పీయూషగ్రంథి ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసి, అండం విడుదలను ప్రేరేపిస్తుంది. ఈస్ట్రోజన్ మరీ ఎక్కువగా ఉత్పత్తి అయితే హార్మోన్ల సమాచార వ్యవస్థ కుంటుపడుతుంది. ల్యూటినైజింగ్ హార్మోన్ పెరిగితే టెస్టోస్టిరాన్ వంటి మగ హార్మోన్ల మోతాదులు ఎక్కువవుతాయి. ఇవి అండాశయాల్లో అండాలు పరిపక్వమవటాన్ని, విడుదల కావటాన్ని అడ్డుకుంటాయి. ఇలా పరిపక్వం కాని అండాలే బుడిపెలు బుడిపెలుగా.. నీటి తిత్తుల్లా కనిపిస్తాయి. అయితే పీఎంఓఎస్ గల అందరిలోనూ తిత్తులు ఉండాలనేమీ లేదు.

### ఇతర సమస్యలూ..

పీఎంఓఎస్ గల అందరిలో తిత్తులు ఉండకపోవచ్చు. వీరిలో మగ హార్మోన్లు పెరగటం (హైపర్‌ఆండ్రోజెనీమియా), రుతుక్రమం అస్తవ్యస్తం కావటం (ఒలిగోమెనోరియా), అండం విడుదల కాకపోవటం (అనావ్యులేషన్) వంటి సమస్యలూ కనిపిస్తుంటాయి. వీటి తీరును బట్టి పీఎంఓఎస్‌ను నాలుగు రకాలుగా (ఎ, బి, సి, డి) చెప్పుకోవచ్చు.

ఎ రకంలో మగ హార్మోన్లు ఎక్కువగా ఉండటం, నెలసరి సరిగా అవకపోవటం, అండాశయాల మీద తిత్తులు అన్నీ ఉంటాయి. రక్తపోటు, బరువు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి.

బి రకంలో తిత్తులు స్పష్టంగా ఉండవు. మగ హార్మోన్లు పెరుగుతాయి, అండం విడుదల కాదు.

సి రకంలో అండం బాగానే విడుదలవుతుంది గానీ మగ హార్మోన్లు పెరుగుతాయి. తిత్తులు స్పష్టంగా ఉంటాయి. చాలావరకూ ఇది సంతాన పరీక్షల సమయంలో బయట పడుతుంటుంది.

డి రకంలో మగ హార్మోన్ల లక్షణాలేవీ ఉండవు. కానీ నెలసరి సరిగా రాదు. తిత్తులు తలెత్తుతాయి.

### నిర్ధారణ ఇలా

చాలావరకూ లక్షణాలను బట్టే పీఎంఓఎస్‌ను అంచనా వేస్తారు. హార్మోన్లు, గ్లూకోజు మోతాదులు తెలుసుకోవటానికి కొన్ని రక్త పరీక్షలు అవసరమవుతాయి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లో తిత్తులు స్పష్టంగా కనిపిస్తాయి. ఇవి 2-9 మి.మీ. సైజులో 20 కన్నా ఎక్కువగా ఉంటే సమస్యగా నిర్ధారిస్తారు. అయితే రజస్వల అయ్యాక 18 ఏళ్లు వచ్చేంతవరకూ నిర్ధారించటం తగదు.

### ఇన్సులిన్ నిరోధకతతోనే..

పీఎంఓఎస్ ఇబ్బందులకు ప్రధాన కారణం కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించక పోవటం (ఇన్సులిన్ నిరోధకత). దీంతో కణాల్లోకి గ్లూకోజు సరిగా వెళ్లదు. ఇలా కణాలు ఇన్సులిన్‌కు స్పందించనప్పుడు శరీరం మరింత ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇది అండాశయ హార్మోన్ల ఉత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. మగ హార్మోన్ల ఉత్పత్తీ ప్రేరేపితమవుతుంది. ఇన్సులిన్ నిరోధకత బరువు పెరగటానికీ దారితీస్తుంది. మరోవైపు బరువు పెరగటమూ ఇన్సులిన్ నిరోధకతకు కారణమవుతుంది. దీని మూలంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు క్రమంగా పెరుగుతూ, మధుమేహం తలెత్తే అవకాశముంది.

ఒక్క మధుమేహం ముప్పే కాదు.. అధిక బరువు, ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొలెస్ట్రాల్ పెరగటం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశమూ పెరుగుతుంది.

### జీవనశైలితో అడ్డుకట్ట

నిజానికి పీఎంఓఎస్ తల్లి కడుపులో ఉండగానే నిర్దేశితమై ఉంటుంది. దీనికి రకరకాల జన్యువులు కారణమవుతుంటాయి. ఇవి ఉన్నా పీఎంఓఎస్ రావాలనేమీ లేదు. అతిగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి జన్యువులను ప్రేరేపించి సమస్యకు దారితీస్తుంటాయి. కాబట్టి జీవనశైలి మార్చుకోవటం చాలా ముఖ్యం. పొట్టలో కొవ్వు, బరువు తగ్గితే దాదాపు అన్ని సమస్యలూ తగ్గుతాయి. అందువల్ల క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, సమతులాహారం తినటం వంటి జీవనశైలి మార్పులతో బరువు తగ్గించుకోవాలి.

### లక్షణాలు.. ఇబ్బందులు

నెలసరి సమయానికి కాకపోవటం. కొందరికి రెండు మూడు నెలలైనా రాదు. ఒకవేళ వస్తే రుతుస్రావం ఆగదు. లేదా కొంచెం కొంచెం కనిపించొచ్చు.

బరువు పెరగటం, ఊబకాయం

గర్భధారణలో ఇబ్బంది

మొటిమలు

గడ్డం, మీసం, కాళ్లూ, చేతుల వంటి భాగాల్లో వెంట్రుకలు మొలవటం

జుట్టు ఊడిపోవటం

మెడ చుట్టుపక్కల, చంకలు, గజ్జల్లో చర్మం నల్లబడటం

నిస్సత్తువ

మూడ్ మారటం

చర్మం మీద సన్న కాయల వంటివి మొలవటం

### మందుల మేలు

కాస్త చిన్నవయసు వారికి నెలసరి సక్రమంగా రావటానికి హార్మోన్ మాత్రలు ఉపయోగపడతాయి.

మధుమేహంలో వాడే మెట్‌ఫార్మిన్ ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి.

చిక్కుళ్లు, ధాన్యాలు, బాదం వంటి వాటిల్లో ఉండే ఇనోసిటాల్స్ మేలు చేస్తాయి. ఇన్సులిన్ నిరోధకత తగ్గటానికి, నెలసరి సమయానికి రావటానికి, అండాశయాలు సరిగా పనిచేయటానికి తోడ్పడతాయి. బరువూ తగ్గుతుంది. అవసరమైతే వీటిని మందుల రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది.

థైరాయిడ్ జబ్బు, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలుంటే తగు చికిత్స అవసరం.

కొందరికి మగ హార్మోన్ల ప్రభావాన్ని నిలువరించే మందులు అవసరమవుతాయి.

# దేశవాళీ అంపైర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్.. వేతనాల పెంపునకు ఏకగ్రీవ ఆమోదం

- దేశవాళీ అంపైర్లు, రిఫరీల వేతనాల సవరణకు బీసీసీఐ ఆమోదం
- ఐపీఎల్ పాలకమండలి సభ్యులుగా అరుణ్ సింగ్ ధూమల్, మజుందార్ ఏకగ్రీవ ఎన్నిక
- 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్, 2028లో బోర్డు శతాబ్ది ఉత్సవాలకు నిర్ణయం
- దివ్యాంగ క్రికెటర్లకు మద్దతు పెంచడంపై సమావేశంలో ప్రత్యేక చర్చ
- 2026-27 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన సర్వసభ్య సమావేశం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు సంబంధించి ఒక కీలకమైన, సానుకూల నిర్ణయం తీసుకుంది. వారి వేతనాల పెంపుతో పాటు, గ్రేడ్లను పునర్వర్గీకరించే ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నేడు ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ చర్య ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. ఈ సమావేశంలో ఐపీఎల్ పాలక మండలికి (జీసీ) ఇద్దరు సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తయింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా మరోసారి కొనసాగేందుకు పోటీ పడిన అరుణ్ సింగ్ ధూమల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రతినిధిగా ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు స్థానాలకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో, బీసీసీఐ ఎన్నికల అధికారి ఏ.కే. జోటి వారి ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించారు. దీనితో ఐపీఎల్ పరిపాలనలో స్థిరత్వం కొనసాగనుంది. సమావేశంలో పలు ఆర్థిక, పరిపాలనాపరమైన తీర్మానాలకు కూడా ఆమోదం లభించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటెడ్ ఖాతాలను, 2026–27 వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీ ఆమోదించింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను కూడా నియమించింది. భవిష్యత్ ప్రణాళికలపై కూడా బోర్డు దృష్టి సారించింది. 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించాలని, అలాగే 2028లో బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని తీర్మానించింది. శతాబ్ది వేడుకలు 2027 డిసెంబర్‌లో ప్రారంభమై 2028 అంతటా కొనసాగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

వీటితో పాటు, లైంగిక వేధింపుల నిరోధక (గ్రూపా) పాలసీ కింద కొత్త అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. వయో నిర్ధారణ విధానానికి కూడా నూతనంగా ఆమోదం తెలిపారు. దేశంలోని దివ్యాంగ క్రికెటర్లకు మద్దతును మరింత క్రమబద్ధీకరించడం, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై కూడా రాష్ట్ర సంఘాలతో

చర్చించారు. ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, సౌరభ్ తివారీ, జయదేవ్ షా, రోహన్ జైట్లీ, అభిషేక్ దాల్మియా వంటి కీలక వ్యక్తులు పాల్గొన్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు. ఝ

# సెమీస్‌కు చేరిన ఇండియా.. ఆసిన్ గేమ్స్ 2026లో జపాన్ చిత్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియన్ గేమ్స్ 2026క్వార్టర్ ఫైనల్ లో ఇండియా సూపర్ డూపర్ పర్ఫామెన్స్ తో జపాన్ ను మట్టికరిపించింది. వాళ్ల దేశంలో వాళ్లనే చిత్తు చేయడం డిఫెండింగ్ చాంపియన్ ఇండియాకు థ్రిల్లింగ్ విక్టరీ. 2026 సెప్టెంబర్ 18న జరిగిన టీ20 మ్యాచ్ లో 19.5 ఓవర్లలో కేవలం 57 పరుగులు మాత్రమే చేసి ఢీలా పడిపోయింది జపాన్.

భారత మహిళల బౌలింగ్ కు జపాన్ పరుగులు తీయడానికి చాలా తీవ్రంగా శ్రమించినా లాభం లేకుండా పోయింది. చరణీ నాలుగు వికెట్లు తీసి జపాన్ బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టింది. మరోవైపు షఫాలీ వర్మ రెండు వికెట్లు, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీయటంతో జపాన్ బ్యాటర్లు పరుగులు తీయలేకపోయారు. 57 రన్స్ చేసి 19.5 ఓవర్లలో ఆలౌట్ అయ్యారు. జపాన్ విధించిన స్వల్ప టార్గెట్ ను కేవలం 5 ఓవర్లలోనే ఊదేశారు హార్మన్ సేన. షఫాల్ వర్మ 15 బంతులలో 40 రన్స్ మెరుపు ఇన్నింగ్స్ తో సునాయాసంగా మ్యాచ్ గెలిచారు. 5వ ఓవర్లో షఫాలీ వరుసగా 4,4 సాధించగా, ఆ తర్వాత రిచా ఘోష్ ఫోర్ కొట్టి స్ట్రైక్ రొటేట్ చేసింది. దీంతో స్ట్రైక్ లోకి వచ్చిన షఫాలీ వర్మ.. సిక్స్ తో ఇన్నింగ్స్ పూర్తి చేసింది. దీంతో ఇండియా 8 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలిచి ఆసియన్ గేమ్స్ 2026 సెమీస్ కు ఎంటరైంది ఇండియా.

# అతడు ఉండగా చింత ఎందుకు?.. శిఖర్ ధావన్‌తో బంధంపై రోహిత్ శర్మ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, తన ఓపెనింగ్ భాగస్వామి శిఖర్ ధావన్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. ‘ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ’ అనే కార్యక్రమంలో పాల్గొన్న హిట్ మ్యాన్, ధావన్‌ను తన ప్రాణ స్నేహితుడిగా అభివర్ణించాడు. “నా ప్రాణస్నేహితుడు వస్తున్నాడు కాబట్టే ఈరోజు నేను ఇంత ఉత్సాహంగా కనిపిస్తున్నాను” అని రోహిత్ చమత్కరించాడు. ఈ సందర్భంగా నిజమైన స్నేహానికి రోహిత్ శర్మ ఒక చక్కని నిర్వచనం ఇచ్చాడు. “కేవలం మీమ్స్, రీల్స్ పంచుకోవడమే స్నేహం కాదు. డ్రెస్సింగ్ రూమ్ అనుభవాలను, గెలుపోటములను, క్లిష్ట పరిస్థితులను, మైదానంలో ఓపెనింగ్ బాధ్యతలను పంచుకోవడమే నిజమైన స్నేహం” అని ఆయన అన్నాడు. జూనియర్ స్థాయి నుంచే తామిద్దరం కలిసి పోటీ క్రికెట్ ఆడటంతో తమ మధ్య ఇంతటి బలమైన బంధం ఏర్పడిందని వివరించాడు.

ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే సమయంలో తనపై ఎలాంటి ఒత్తిడి ఉండేది కాదని రోహిత్ తెలిపాడు. “శిఖర్‌తో ఆడుతున్నప్పుడు నాపై ఒత్తిడి తగ్గుతుందని ఎప్పుడూ భావించేవాడిని. ఎందుకంటే అతను ఆ ఒత్తిడిని తనపైకి తీసుకుని, నా వరకు రాకుండా చూసేవాడు. అందుకే నేను ఎప్పుడూ ‘శిఖర్ ఉండగా చింత ఎందుకు’ అని అనుకుంటాను” అని రోహిత్ పేర్కొన్నాడు. భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీలలో ఒకటిగా నిలిచిన వీరిద్దరి స్నేహం, క్రికెట్ ప్రయాణాన్ని ఈ ఎపిసోడ్ ఆవిష్కరించింది.



సాంప్రదాయక అందంతో ఆకట్టుకుంటున్న సీరత్ కపూర్

# ట్రెండ్ షిఫ్ట్: క్రూరత్వం నుంచి డివోషన్ వైపు!



గ్లామర్ రంగంలో ట్రెండ్ ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి నేటి సినిమా పరిశ్రమ సరళి చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. ఒకవైపు కిల్, యానిమల్ వంటి చిత్రాలు తెరపై హింసను, మునుపెన్నడూ లేని క్రూయాల్టీని ప్రదర్శించి బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించగా.. అడల్ట్ కంటెంట్ చిత్రాల జోరు కూడా బాలీవుడ్‌లో విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు ఏదైనా బోల్డ్ పాయింట్ కోసం చాలా అరుదుగా వాడే -ఏ- సర్టిఫికేట్ ట్రెండ్..ఇప్పుడు దర్శకనిర్మాతలకు ఒక గుడ్డి అనుకరణగా మారుతోంది. గతంలో -యానిమల్- సాధించిన భారీ విజయంతో మొదలైన ఈ ధోరణి ఇటీవల మీర్జాపూర్, ధురంధర్ ది రివెంజ్, కాక్‌టెయిల్ 2, అస్సీ వంటి పెద్ద సినిమాలకు పాకి నిర్మాతలు ఈ బాటలోనే నడిచేలా చేసిందని విశ్లేషణలు వచ్చాయి. ఈ ట్రెండ్‌లో భాగంగానే సెప్టెంబర్ 18న విడుదలైన -దైరా-, -వైబ్- సినిమాలు కూడా సెన్సార్ బోర్డు నుంచి -ఏ- సర్టిఫికేట్ సొంతం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ -దైరా- చిత్రం సెప్టెంబర్ 11నే సెన్సార్ పూర్తి చేసుకుని 2 గంటల 23 నిమిషాల నిడివితో ఏ సర్టిఫికేట్ దక్కించుకుంది. ఇందులో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూనీ కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా నటిస్తున్నారు. ఒక అమ్మాయి కిడ్నాప్, అఘాయిత్యం, హత్య నేపథ్యంలో సాగే ఈ కథలో జువెనైల్ చట్టాలు, ఎన్‌కౌంటర్ల చుట్టూ ఉన్న సున్నితమైన వివాదాలను చర్చించనున్నారు. ఇది నటి కరీనా కెరీర్‌లో ఏడో -ఏ- రేటెడ్ సినిమా కావడం మరో విశేషం.

అలాగే కునాల్ ఖేము దర్శకత్వంలో తెరకెక్కిన -వైబ్- చిత్రం కూడా 2 గంటల 25 నిమిషాల రన్‌టైమ్‌తో సెన్సార్‌ను పూర్తి చేసుకుని -ఏ- సర్టిఫికేట్ పొందడం గమనార్హం. ఇందులో ప్రీతి జింటా కీలక పాత్రలో నటిస్తుండగా.. మొదట ఇదొక ఫన్ ఎంటర్‌టైనర్‌గా ప్రచారం జరగడంతో చివరికి దీనికి అడల్ట్ సర్టిఫికేట్ రావడం ప్రేక్షకులకు షాకిచ్చింది. ఇలా రొమాంటిక్, క్రైమ్, వయొలెంట్ జోనర్లలో అడల్ట్ సినిమాలే సర్వవ్యాప్తంగా మారుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఇండస్ట్రీలో మరో భారీ ఊహించని మార్పు చోటు చేసుకుంటోంది. కేవలం బోల్డ్ – వైలెంట్ సినిమాలకే కాకుండా డివోషనల్ చిత్రాలకు కూడా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారనే వాస్తవం క్రమంగా నిరూపణ అవుతోంది. ప్రస్తుతం గ్లామర్ – కమర్షియల్ రంగంలో డివోషనల్ సినిమాల హవా క్రమంగా పెరుగుతోంది. -హనుమాన్-, -మహావతార్ నరసింహా-, -హనుమాన్ అంశ్- వంటి చిత్రాల ఘన విజయం అందించిన స్ఫూర్తితో ఇప్పుడు వారణాసి, రామాయణం వంటి భారీ ప్రాజెక్ట్‌లతో పాటు పలువురు ఆధ్యాత్మిక గురువుల బయోపిక్‌లు, పౌరాణిక నేపథ్య చిత్రాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్నాయి. ఇవన్నీ కేవలం భక్తి భావానికి మాత్రమే పరిమితం కాకుండా.. ఆధునిక సాంకేతిక హంగులు, భారీ విజువల్ ఎఫెక్ట్స్ .. కమర్షియల్ హంగులను అద్దుకుని వస్తుండటంతో ప్రేక్షకులలో వీటిపై అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామాలు గ్లామర్ రంగంలో ప్రేక్షకుల అభిరుచులు ఏ స్థాయిలో మారుతున్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు హింసాత్మక కథలు, అడల్ట్ కంటెంట్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షాక్ ఇస్తున్న మేకర్స్.. మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక సెంటిమెంట్లను క్యాష్ చేసుకునేందుకు భారీ డివోషనల్ సినిమాల వైపు పరుగులు పెడుతున్నారు. మొత్తానికి కంటెంట్ ఏదైనా సరే ప్రేక్షకుల నాడిని పట్టుకుని.. కమర్షియల్ హంగులతో తెరకెక్కిస్తే అది ఏ జోనర్ అయినా సరే అఖండ విజయాలను సాధించగలదని నేటి ట్రెండ్ నిరూపిస్తోంది.



రాశి ఖన్నా అప్రయత్నమైన ఆకర్షణను నిర్వచించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965